



# ప్రజా వాయిస్

PRAJA VOICE ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

సంపుటి: 02 | సంచిక: 23 | ఎడిటర్: మేనం శ్యామ్ | మంగళవారం 11-08-2026 | పేజీలు: 10


## సిరా చుక్క

వాన కోసం వెలిగిన వేదాగ్ని...
వరుణ యాగం ముగిసింది..
పూర్ణాహుతి పూర్తయింది..
వేద మంత్రాలు మార్మోగాయి.
కానీ యాగం వెనుక ఉన్న అసలు ఆకాంక్ష
మాత్రం ప్రతి రైతు గుండెల్లో
నాటుకుపోయినదే.. వానలు కురవాలి..
పంటలు పండాలి.. రైతు బతుకు పచ్చబడాలి.
వర్షం కోసం వరుణుడిని ప్రార్థించే
సంప్రదాయానికి వైదిక కాలం నుంచే
మూలాలున్నాయి.
కాలం మారింది.. వ్యవసాయ పద్ధతులు
మారాయి.. సాంకేతికత పెరిగింది.
అయినా ఆకాశం వైపు చూసే
రైతు చూపులో మాత్రం మార్పు రాలేదు.
చినుకు కోసం ఎదురుచూసే ఆ చూపే
మనిషికి ప్రకృతి ముందు తన పరిమితిని
గుర్తుచేస్తుంది.
నాగార్జునసాగర్‌లో జరిగిన వరుణ యాగం
ఒక ఆధ్యాత్మిక కార్యక్రమం మాత్రమే కాదు..
జలమే జీవనం, రైతే దేశానికి వెన్నెముక అనే
సత్యాన్ని మరోసారి గుర్తుచేసిన సందర్భం.
యాగంలో వెలిగిన ప్రతి అగ్నిజ్వాల వెనుక
ఒక రైతు ఆశ ఉంది.. ప్రతి మంత్రోచ్చారణ వెనుక
ఒక కుటుంబం ఆకాంక్ష ఉంది.
యాగాల పుణ్యమా, ప్రకృతి కరుణా,
పాలకుల ప్రణాళికలా.. కారణం ఏదైనా సరే..
చినుకు చినుకుగా కురిసే వాన,
పచ్చని పొలాలుగా మారి అన్నదాత ఇంట
ఆనందం నింపాలి.

– నడ్డి శివకృష్ణ యాదవ్.,
ఉమ్మడి నల్గొండ. ప్రజా వాయిస్ బ్యూరో చీఫ్..



# వానలు కురవాలి..
# రైతు బతుకులు పచ్చబడాలి

- పూర్ణాహుతితో సంపూర్ణమైన మహా వరుణ యాగం
- నాగార్జునసాగర్ లో వైభవంగా వైదిక క్రతువులు
- 108 మంది రుత్వికులు.. 11 హోమగుండాల్లో ప్రత్యేక పూజలు
- పూర్ణాహుతిలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి దంపతులు
- రాష్ట్ర సుభిక్షం.. రైతుల సంక్షేమమే లక్ష్యంగా మహా సంకల్పం



**ప్రజా వాయిస్ బ్యూరో, నల్గొండ.** రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసి ప్రజలు సుభిక్షంగా ఉండాలని, రైతుల పంట పొలాలు పచ్చబడాలని, నదులు, ప్రాజెక్టులు, చెరువులు జలకళతో కళకళలాడాలని ఆకాంక్షిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన మహా వరుణ యాగం సోమవారం పూర్ణాహుతితో సంపూర్ణమైంది. నాగార్జునసాగర్‌లోని విజయ్‌విహార్ ఆవరణలో కృష్ణా నది ఒడ్డున నిర్వహించిన ఈ మహా క్రతువు ఆద్యంతం భక్తిభావంతో సాగింది. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో 108 మంది రుత్వికులు 11 హోమగుండాల్లో శాస్త్రోక్తంగా వైదిక క్రతువులు నిర్వహించారు. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచే ప్రత్యేక పూజలు, హోమాలు ప్రారంభమై పూర్ణాహుతితో ముగిశాయి.

**రాష్ట్ర సుభిక్షం కోసం మహా సంకల్పం**

రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిసి అన్ని ప్రాంతాలు సస్యశ్యామలం కావాలని ప్రభుత్వం మహా వరుణ యాగానికి శ్రీకారం చుట్టింది. యాగ ప్రారంభ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దంపతులు, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి పాల్గొని వైదిక క్రతువులను ప్రారంభించారు. యాగశాలలో వేదపండితుల మంత్రోచ్చారణలు, హోమాగ్ని జ్వాలలతో కృష్ణాతీరం

మిగతా 2లో



వరుణ యాగంలో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు,ప్రముఖులు..

## పెద్ది విగ్రహ గద్దె కూల్చివేత..
## నర్సంపేటలో రగిలిన రాజకీయ చిచ్చు!

- అనుమతులు లేవంటూ అర్ధరాత్రి గద్దె కూల్చివేత.. బీఆర్ఎస్ ఆగ్రహం!
- కాంగ్రెస్ సర్కార్ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందంటూ ఎర్రబెల్లి దయాకర్‌రావు ఫైర్!
- నర్సంపేట అంబేద్కర్ సెంటర్‌లో బీఆర్ఎస్ రాస్తారోకో.. పోలీసులతో తోపులాట!
- ప్రజల మనోభావాలను గౌరవించి గద్దెను పునరుద్ధరించాలని మాజీ మంత్రి డిమాండ్!
- అనుమతులు లేకుండా విగ్రహాల ఏర్పాటు సాధ్యం కాదంటున్న మున్సిపల్ అధికారులు!



ప్రజా వాయిస్, బ్యూరో :నర్సంపేటలో దివంగత మాజీ ఎమ్మెల్యే, ఉద్యమకారుడు పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహం ఏర్పాటుకు నిర్మించిన గద్దె కూల్చివేత వ్యవహారం రాజకీయ దుమారం రేపుతోంది. ఇటీవల పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆకస్మికంగా మృతి చెందిన నేపథ్యంలో.. ఆయన జ్ఞాపకార్థం నర్సంపేటలో విగ్రహం ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ నేతలు నిర్ణయించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ మెడికల్ కళాశాల ఎదుట ఉన్న ప్రైవేట్ స్థలంలో గద్దె నిర్మించారు. అయితే మున్సిపల్ అధికారులు ఈ నిర్మాణాన్ని కూల్చివేయడంతో వివాదం ముదిరింది.

**గద్దె కూల్చివేతపై ఎర్రబెల్లి ఫైర్!**

పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహం కోసం నిర్మించిన గద్దెను కూల్చివేయడంపై మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతలు కక్షసాధింపు చర్యలను మానుకోవాలని హెచ్చరించారు. పద్ధతి మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని

మిగతా 2లో

## మధిరలో రచ్చకెక్కిన కాంగ్రెస్ అరాచకాలు!

- మధిరలో భట్టి అనుచరుల దాష్టీకం
- నాగులవంచ గ్రామంలో రైతు సెల్ఫీ కలకలం
- కాంగ్రెస్ నాయకుల వేధింపులు తాళలేక రైతు ఆత్మహత్యాయత్నం?
- మా వెనుక భట్టి ఉన్నాడు.. ఏం పీక్కుంటావో పీక్కో అని బెదిరింపులు?

2లో



## తెలంగాణలో జనసేన బరిలోకి రావాల్సిందే..
## పవన్‌కు రాజాసింగ్ కీలక పిలుపు!

- మున్సిపల్, అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో జనసేన పోటీ చేయాలి!
- తెలంగాణ యువతలో పవన్ కళ్యాణ్‌కు ఉన్న క్రేజ్‌ను రాజకీయంగా ఉపయోగించుకోవాలి!
- బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసిగిపోయారు
- ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్నారు!
- జనసేనకు మంచి భవిష్యత్ ఉంది
- పవన్ సీఎం అయ్యే అవకాశమూ ఉంది!
- బీజేపీ నాయకత్వంపై మరోసారి రాజాసింగ్ అసంతృప్తి
- 'కాంప్రమైజ్ రాజకీయాలతో పార్టీ నష్టపోయింది'!



**ప్రజా వాయిస్, హైదరాబాద్ బ్యూరో** :తెలంగాణ రాజకీయాల్లో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు కీలక విజ్ఞప్తి చేశారు. రానున్న మున్సిపల్, అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలోని అన్ని స్థానాల్లో జనసేన అభ్యర్థులను బరిలోకి దించాలని కోరారు. తెలంగాణలో జనసేనకు రాజకీయంగా మంచి అవకాశాలు ఉన్నాయని.. పవన్ కళ్యాణ్‌కు ముఖ్యంగా యువతలో ఉన్న క్రేజ్, అభిమానాన్ని రాజకీయ బలంగా మలచుకుంటే పార్టీ బలమైన శక్తిగా ఎదగవచ్చని రాజాసింగ్ అభిప్రాయపడ్డారు.

**'తెలంగాణలో అన్ని స్థానాల్లో పోటీ చేయాలి!'**

ఈ మేరకు రాజాసింగ్ ఓ వీడియో విడుదల చేసి తన అభిప్రాయాలను వెల్లడించారు.

మిగతా 2లో

## తెలంగాణ పోలీసులకు కొత్త సవాళ్లు..
## సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై ఉక్కుపాదం!

- నక్సలిజం తర్వాత పోలీసింగ్‌కు అతిపెద్ద సవాళ్లు ఇవే
- డీజీపీ సీవీ ఆనంద్ కీలక వ్యాఖ్యలు!
- సైబర్ మోసాలతో ఒక్క ఏడాదిలోనే ప్రజలు కోల్పోయింది రూ.1,700 కోట్లు!
- మోసపోయిన వెంటనే ఫిర్యాదు చేయకపోవడంతో తగ్గుతున్న నగదు రికవరీ అవకాశాలు
- డ్రగ్స్ మాఫియాపై కఠిన చర్యలు
- చాక్లెట్ల రూపంలో చిన్నారులను టార్గెట్ చేస్తున్న ముఠాలు!
- రైళ్లలో వచ్చి చైన్ స్నాచింగ్, బైక్ చోరీలు
- వరంగల్, కాజీపేటపై ప్రత్యేక నిఘా!
- సాంకేతికత తోడ్పాటే కానీ పోలీసింగ్‌కు ప్రత్యామ్నాయం కాదు
- క్షేత్రస్థాయిలో అధికారులు అందుబాటులో ఉండాలి!



**ప్రజా వాయిస్, బ్యూరో** : తెలంగాణ పోలీసులకు కాలానుగుణంగా కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయని రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. ఒకప్పుడు నక్సలిజం పోలీసింగ్‌కు అతిపెద్ద సవాలుగా ఉండేదని.. ప్రస్తుతం సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలు, ఆర్థిక నేరాలు, రోడ్డు భద్రత ప్రధాన సవాళ్లుగా మారాయని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు సమాజానికి హాని కలిగిస్తున్న కొత్త తరహా నేరాలను అరికట్టడంపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

**రూ.1,700 కోట్ల సైబర్ మోసం!**

తెలంగాణలో సైబర్ నేరాల తీవ్రతపై డీజీపీ సీవీ ఆనంద్ ఆందోళన వ్యక్తం చేశారు. గత ఏడాది రాష్ట్రంలో సైబర్ నేరాల కారణంగా ప్రజలు సుమారు రూ.1,700 కోట్లు నష్టపోయారని వెల్లడించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడం వల్ల

## తెలంగాణలో ఎస్ఐఆర్ సెగ..
## 74 లక్షల ఓట్లపై టెన్షన్!

- నేటితో ముగియనున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల సవరణ ప్రక్రియ
- 73,95,954 ఓట్లపై ఉత్కంఠ!
- హైదరాబాద్ ఉమ్మడి జిల్లాలోనే దాదాపు 43 లక్షల ఓట్లు గల్లంతయ్యే అవకాశం!
- రాష్ట్రవ్యాప్తంగా 3.38 కోట్ల మంది ఓటర్లు
- 2.64 కోట్ల ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తి
- డిజిటలైజేషన్‌లో హైదరాబాద్ చివరి స్థానం
- యాదాద్రి భువనగిరి టాప్‌లో!
- ఆగస్టు 17న ముసాయిదా ఓటర్ల జాబితా
- అప్పుడే అసలు లెక్క తేలే అవకాశం!




**ప్రజా వాయిస్, బ్యూరో** : తెలంగాణలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ నేటితో ముగియనున్న వేళ.. రాష్ట్ర రాజకీయాల్లో కొత్త టెన్షన్ మొదలైంది. ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించని ఓటర్ల సంఖ్య భారీగా ఉండటంతో.. దాదాపు 74 లక్షల ఓట్లు ముసాయిదా ఓటర్ల జాబితాలో కనిపించకపోయే అవకాశం ఉందన్న చర్చ రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. ముఖ్యంగా హైదరాబాద్ ఉమ్మడి జిల్లా పరిధిలోనే దాదాపు 43 లక్షల వరకు ఓట్లు ఈ జాబితాలో ఉండే అవకాశం ఉందన్న సమాచారం ఇప్పుడు పార్టీల్లో కలకలం రేపుతోంది.

మిగతా 2లో

# వానలు కురవాలి.. రైతు బతుకులు పచ్చబడాలి



మొదటి పేజీ తరువాయి

ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

**పూర్ణాహుతి సమర్పించిన సీఎం దంపతులు**

మహా వరుణ యాగం పూర్ణాహుతి కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి దంపతులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. రుత్వికుల మార్గదర్శకత్వంలో పూర్ణాహుతి సమర్పించారు. మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దంపతులు కూడా పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రకృతి అనుకూలించాలని ప్రార్థనలు చేశారు.

**రైతుల ముఖాల్లో చిరునవ్వులే లక్ష్యం**

యాగం అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలని ఆకాంక్షించారు. కృష్ణా, గోదావరి నదులు నిండుగా ప్రవహించాలని, శ్రీశైలం, నాగార్జునసాగర్ సహా అన్ని ప్రాజెక్టులు నీటితో నిండాలని కోరుకున్నారు. ప్రతి చెరువు, కుంటలో జలకళ కనిపించాలని, భూగర్భ జలాలు పెరగాలని, పంటలు పుష్కలంగా పండి రైతుల ముఖాల్లో చిరునవ్వులు వెల్లివిరియాలని వరుణదేవుడిని ప్రార్థించారు. రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

**సంప్రదాయానికి.. విశ్వాసానికి ప్రతీకగా**

వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలపై అంచనాలు వెలువడిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ మహా వరుణ యాగాన్ని నిర్వహించింది. శాస్త్రీయ అంచనాలు, సాగునీటి ప్రాజెక్టుల ప్రణాళికలు, నీటి నిర్వహణ చర్యలతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో భాగమైన వైదిక క్రతువులను నిర్వహించడం ద్వారా ప్రకృతి అనుగ్రహం కోసం సంప్రదాయానికి.. విశ్వాసానికి ప్రతీకగా తెలంగాణ ప్రభుత్వం యాగన్ని నిర్వహించడం జరిగింది.

**కృష్ణాతీరంలో కనువిందు చేసిన యాగశాల**

విజయ్‌విహార్ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలను పుష్పాలు, మామిడి తోరణాలు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. 11 హోమగుండాల వద్ద 108 మంది రుత్వికులు వైదిక మంత్రాలను పఠిస్తూ హోమాలు నిర్వహించారు. యాగశాలకు తరలివచ్చిన ప్రజాప్రతినిధులు, అధికారులు, భక్తులు ఆధ్యాత్మిక వాతావరణంలో కార్యక్రమాన్ని వీక్షించారు. కృష్ణా నది ఒడ్డున సాగిన మహా వరుణ యాగం నాగార్జునసాగర్‌కు ప్రత్యేక ఆధ్యాత్మిక శోభను తీసుకొచ్చిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

**సీఎంకు ఘన స్వాగతం**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాగార్జునసాగర్‌కు చేరుకున్న సందర్భంగా బీసీ సంక్షేమ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, పలువురు ప్రజాప్రతినిధులు పుష్పగుచ్ఛాలతో ఘనంగా స్వాగతం పలికారు.

**ప్రముఖుల హాజరు**

కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కొండా సురేఖ, రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ప్రభుత్వ సలహాదారులు కే. కేశవరావు, సుదర్శన్‌రెడ్డి, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, ఎమ్మెల్యేలు కుందూరు జయవీర్‌రెడ్డి, బీర్ల ఐలయ్య, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, వేముల వీరేశం, మందుల సామేలు, బత్తుల లక్ష్మారెడ్డి, బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్ , ఇతర ప్రజాప్రతినిధులు, రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, ఎస్పీ శరత్ చంద్ర పవార్, అదనపు కలెక్టర్లు జె. శ్రీనివాస్, ప్రేమ్ కరణ్‌రెడ్డి, మిర్యాలగూడ ఆర్డీఓ రమణారెడ్డి, దేవస్థాన అధికారులు, జిల్లా అధికారులు, మున్సిపల్, కార్పొరేషన్ చైర్మన్లు తదితరులు యాగంలో పాల్గొన్నారు.



**నాగార్జున సాగర్ జలకళతో వర్ధిల్లాలి.. పచ్చని పంటలతో రైతన్నల ఇల్లు కళకళలాడాలి.. ప్రజాక్షేమమే ధ్యేయంగా వరుణ యాగంలో పాల్గొని, ప్రత్యేక పూజలు చేస్తున్న శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి.**

## సాగర్ ఒడ్డున నాటి జ్ఞాపకం.. నేడు వరుణ యాగానికి రాక

నాగార్జునసాగర్‌తో సీఎం రేవంత్‌రెడ్డికి రాజకీయ, ఆధ్యాత్మిక ప్రాధాన్యమే కాదు..ఓ మధురమైన వ్యక్తిగత జ్ఞాపకం కూడా ఉంది. రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసి రైతుల బతుకులు పచ్చబడాలని ఆకాంక్షిస్తూ సోమవారం నాగార్జునసాగర్‌లో నిర్వహించిన మహా వరుణ యాగంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని పూర్ణాహుతి కార్యక్రమంలో భాగస్వామ్యులయ్యారు. ఇదే సాగర్ ప్రాంతం ఆయన వ్యక్తిగత జీవితంలోని ఓ మధుర జ్ఞాపకానికీ వేదికగా నిలిచింది. యువకుడిగా ఉన్న సమయంలో గీతారెడ్డితో నాగార్జునసాగర్‌లో బోటు ప్రయాణం సందర్భంగా పరిచయం ఏర్పడి, ఆ పరిచయం ప్రేమగా మారిందని ఆయనను సన్నిహితంగా తెలిసినవారు చెబుతారు. ఆ బంధం 1992లో వివాహంతో జీవితాంతం సాగింది. నాడు వ్యక్తిగత జీవితంలో ఓ మధుర జ్ఞాపకాన్ని అందించిన సాగర్.. నేడు ముఖ్యమంత్రిగా రాష్ట్ర ప్రజల సంక్షేమం, రైతుల క్షేమం కోసం నిర్వహించిన వరుణ యాగానికి వేదిక కావడం ఆసక్తికరమైన మలుపుగా నిలిచింది. నాటి ప్రేమ జ్ఞాపకాలకు సాక్షిగా నిలిచిన సాగర్.. నేడు ప్రజల కోసం వర్షాలను కోరుతూ నిర్వహించిన యాగానికి సాక్ష్యమైంది.



## మధిరలో రచ్చకెక్కిన కాంగ్రెస్ అరాచకాలు!



**ప్రజా వాయిస్ ఖమ్మం:** ఖమ్మం జిల్లా, మధిర నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకుల అరాచకాలు, వేధింపులు శ్రుతిమించాయి. అధికార బలంతో స్థానిక నాయకులు చేస్తున్న వేధింపులు తట్టుకోలేక ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సెల్ఫీ వీడియో ఘటన తీవ్ర కలకలం రేపింది.ఖమ్మం జిల్లా, చింతకాని మండలం, నాగులవంచ గ్రామానికి చెందిన జొన్నలగడ్డ మల్లికార్జున రావు అనే రైతుకు చెందిన భూమిని, రోడ్డు విస్తరణ సాకుగా చూపి బలవంతంగా లాక్కోవడానికి స్థానిక కాంగ్రెస్ నాయకులు యత్నించారని. బాధితుడు సెల్ఫీలో తెలిపిన వివరాల ప్రకారం మార్కెట్ కమిటీ చైర్మన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వరరావు, ఆయన అనుచరులు ఈ వ్యవహారంలో రైతుపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెచ్చారని. ఊరిలో అందరి భూములను వదిలేసి, కావాలని తన భూమిని మాత్రమే లక్ష్యంగా చేసుకుని రోడ్డు పేరిట ఆక్రమించుకోవడానికి చూస్తున్నారని బాధిత రైతు వాపోయాడు. దీనిపై ప్రశ్నించినందుకు కాంగ్రెస్ నాయకులు, ఆయన అనుచరులు రైతుపై భౌతిక దాడికి దిగడమే కాకుండా, ఎదురు తిరిగితే అక్రమ కేసులు బనాయిస్తామని బెదిరింపులకు పాల్పడ్డారని వా పోయాడు.అదేవిధంగా, మా వెనుక డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఉన్నారు.. నువ్వు ఏం పీక్కుంటావో పీక్కో అంటూ కాంగ్రెస్ నాయకులు అత్యంత ధిక్కారంగా హెచ్చరించినట్లు రైతు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక నాయకుల వేధింపులు, బెదిరింపులు తాళలేక తీవ్ర మనస్తాపానికి గురైన మల్లికార్జున రావు పురుగుల మందు తాగి ప్రాణాలు తీసుకునేందుకు యత్నించాడు. గమనించిన తోటి రైతులు, కుటుంబ సభ్యులు ఆయన ను వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సదరు కాంగ్రెస్ నాయకులపై కఠిన చర్యలు తీసుకుని, తమ భూమికి రక్షణ కల్పించాలని బాధిత రైతు కుటుంబ సభ్యులు, గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

## పెద్ది విగ్రహ గద్దె కూల్చివేత.. నర్సంపేటలో రగిలిన రాజకీయ చిచ్చు!

హెచ్చరించారు.పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రజలకు అందించిన సేవలకు గుర్తుగా విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తే.. అందుకోసం నిర్మించిన గద్దెను కూల్చివేయడం అన్యాయమని ఎర్రబెల్లి మండిపడ్డారు. ప్రజల మనోభావాలను గౌరవించి గద్దెను తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

**అంబేద్కర్ సెంటర్‌లో రాస్తారోకో.. ఉద్రిక్తత!**

గద్దె కూల్చివేతకు నిరసనగా నర్సంపేట అంబేద్కర్ సెంటర్‌లో బీఆర్ఎస్ శ్రేణులు రాస్తారోకో నిర్వహించారు. మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ఆందోళనలో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.రాస్తారోకోను అడ్డుకునే క్రమంలో బీఆర్ఎస్ నాయకులు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. దీంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొనగా.. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చి బీఆర్ఎస్ నేతలను అక్కడి నుంచి పంపించారు.

**'కక్షసాధింపులో భాగంగానే కూల్చివేత'**

గద్దె కూల్చివేతను బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా తప్పుబడుతున్నారు. ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా రాత్రివేళ గద్దెను కూల్చివేశారని ఆరోపిస్తున్నారు. ప్రైవేట్ స్థలంలో నిర్మాణం చేపట్టినా.. పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్న ప్రయత్నాన్ని అడ్డుకోవడం ప్రభుత్వ కక్షసాధింపు చర్యల్లో భాగమేనని ఆరోపిస్తున్నారు.పెద్ది సుదర్శన్‌రెడ్డి ఉద్యమంలో కీలకంగా పనిచేశారని, ఆయనకు గౌరవ సూచకంగా విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలు ఆయన సేవలను స్మరించుకోవాలనుకుంటున్నారని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు.

**'అనుమతులు లేకపోతే నిర్మాణం ఎలా?'**

మరోవైపు.. విగ్రహ ఏర్పాటుకు సంబంధించి మున్సిపల్ అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే గద్దె నిర్మించారని అధికారులు చెబుతున్నట్లు తెలుస్తోంది. ప్రైవేట్ స్థలమైనప్పటికీ బహిరంగంగా విగ్రహం ఏర్పాటు చేయాలంటే సంబంధిత మున్సిపల్ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేస్తున్నట్లు సమాచారం.

**ఎక్కడి వరకు వెళ్తుందో?**

పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహం కోసం నిర్మించిన గద్దె కూల్చివేత ఇప్పుడు నర్సంపేటలో రాజకీయ వివాదంగా మారింది. ఒకవైపు అనుమతులు లేకపోవడమే కూల్చివేతకు కారణమని అధికారులు చెబుతుండగా.. మరోవైపు ఇది పూర్తిగా రాజకీయ కక్షసాధింపు చర్యేనని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు.

## తెలంగాణ పోలీసులకు కొత్త సవాళ్లు.. సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై ఉక్కుపాదం!

నగదును రికవరీ చేసే అవకాశాలు తగ్గుతున్నాయని తెలిపారు.ముఖ్యంగా అధిక లాభాలు వస్తాయంటూ నమ్మించి చేసే పెట్టుబడి మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాల నియంత్రణలో ప్రధానమంత్రి ప్రగతి సమీక్షలో తెలంగాణకు దేశంలోనే తొలి స్థానం లభించిందని డీజీపీ తెలిపారు.

**'టెక్నాలజీ ప్రత్యామ్నాయం కాదు!'**

పోలీసింగ్‌లో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ.. దానిని ప్రాథమిక పోలీసింగ్‌కు ప్రత్యామ్నాయంగా భావించరాదని డీజీపీ స్పష్టం చేశారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదులను వెంటనే స్వీకరించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.దర్యాప్తుల పురోగతి, కోర్టు కేసుల పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. డీసీపీలు, ఏసీపీలు, డీఎస్పీలు క్షేత్రస్థాయిలో ఎక్కువ సమయం గడుపుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

**చాక్లెట్లతో చిన్నారులకు డ్రగ్స్ అలవాటు?**

మాదకద్రవ్యాల విషయంలో డీజీపీ సీవీ ఆనంద్ కీలక హెచ్చరిక చేశారు. చాక్లెట్ల రూపంలో చిన్నారులను మాదకద్రవ్యాలకు అలవాటు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇలాంటి నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.డ్రగ్స్ నియంత్రణలో విద్యాసంస్థలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపేందుకు పోలీసులు ప్రత్యేకంగా పనిచేస్తున్నారని డీజీపీ తెలిపారు.

**రైళ్లలో వచ్చి.. చోరీలు చేసి వెళ్లిపోతున్న ముఠాలు!**

వరంగల్, కాజీపేట కేంద్రంగా జరుగుతున్న చైన్ స్నాచింగ్, బైక్ చోరీలపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టినట్లు డీజీపీ వెల్లడించారు. బీహార్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల నుంచి రైళ్లలో వచ్చి, చోరీలకు పాల్పడి తిరిగి వెళ్లిపోతున్న ముఠాల కదలికలపై నిఘా పెంచినట్లు తెలిపారు.ఇలాంటి నేరాలను అరికట్టేందుకు నాట్‌గ్రిడ్ సహకారంతో సమాచార మార్పిడి, నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నట్లు వెల్లడించారు.

## తెలంగాణలో జనసేన బరిలోకి రావాల్సిందే.. పవన్‌కు రాజాసింగ్ కీలక పిలుపు!

మొదటి పేజీ తరువాయి

తెలంగాణలో రానున్న మున్సిపల్, అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన అన్ని స్థానాల్లో పోటీ చేయాలని పవన్ కళ్యాణ్‌ను కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో పవన్ నాయకత్వంలో జనసేన బలమైన రాజకీయ శక్తిగా ఎదిగిందని పేర్కొన్నారు.అదే తరహాలో తెలంగాణలోనూ పార్టీని క్రియాశీలకంగా మార్చాలని సూచించారు. ముఖ్యంగా తెలంగాణ యువతలో పవన్ కళ్యాణ్‌కు ఉన్న విపరీతమైన ఫాలోయింగ్‌ను పార్టీ విస్తరణకు ఉపయోగించుకోవాలని అన్నారు.

**బీఆర్ఎస్, కాంగ్రెస్‌పై రాజాసింగ్ ఫైర్!**

తెలంగాణ ప్రజలు ఇప్పటికే బీఆర్ఎస్ పదేళ్ల పాలనను చూశారని.. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను కూడా చూస్తున్నారని రాజాసింగ్ విమర్శించారు. రెండు ప్రభుత్వాల పాలనలో తెలంగాణ అప్పుల ఊబిలో కూరుకుపోయిందని ఆరోపించారు.రాష్ట్రంలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని, రైతులు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. దీంతో వచ్చే ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు ఒక ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్నారని రాజాసింగ్ అన్నారు.

**'జనసేనకు మంచి భవిష్యత్ ఉంది!'**

తెలంగాణలోని అన్ని నియోజకవర్గాల్లో జనసేన పోటీ చేస్తే పార్టీకి మంచి భవిష్యత్ ఉంటుందని రాజాసింగ్ అభిప్రాయపడ్డారు. రానున్న ఎన్నికల నాటికి జనసేన నాయకుడు తెలంగాణ ముఖ్యమంత్రి అయ్యే అవకాశం కూడా ఉందంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.అయితే ఇవి తన వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమేనని.. పవన్ కళ్యాణ్‌కు తాను చేస్తున్న విజ్ఞప్తిగా మాత్రమే చూడాలని రాజాసింగ్ స్పష్టం చేశారు.

**బీజేపీ నాయకత్వంపై మరోసారి అసంతృప్తి!**

ఇదే సమయంలో తెలంగాణ బీజేపీ నాయకత్వంపైనా రాజాసింగ్ మరోసారి అసంతృప్తి వ్యక్తం చేశారు. 2014 నుంచి పార్టీలో కొందరు నాయకులు అనుసరిస్తున్న 'కాంప్రమైజ్ రాజకీయాల' వల్ల బీజేపీ తీవ్రంగా నష్టపోయిందని ఆరోపించారు.పార్టీ కోసం నాయకులు సమష్టిగా పనిచేసి ఉంటే ఇప్పటికే తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చి ఉండేదని వ్యాఖ్యానించారు. పార్టీ క్యాడర్‌ను పట్టించుకోకపోవడం, సీనియర్ నాయకులను పక్కన పెట్టడం, ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలకు సరైన ప్రాధాన్యం ఇవ్వకపోవడం వంటి అంశాలపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

**తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలేనా?**

రాజాసింగ్ తాజా వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో చర్చకు దారితీశాయి. ఒకవైపు జనసేన తెలంగాణలో విస్తరించాలని ఆయన బహిరంగంగా పిలుపునివ్వడం.. మరోవైపు బీజేపీ నాయకత్వంపై అసంతృప్తి వ్యక్తం చేయడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.రానున్న ఎన్నికల్లో జనసేన తెలంగాణలో విస్తృతంగా పోటీ చేస్తుందా? పవన్ కళ్యాణ్ దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు? బీజేపీ–జనసేన మధ్య తెలంగాణలో కొత్త రాజకీయ సమీకరణాలకు అవకాశం ఉంటుందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.



## ఖండాంతరాలు దాటిన తెలంగాణ సంస్కృతి

- మలేషియాలో మార్మోగిన 'బోనాలు 2026' సంబురాలు
- MYTA ఆధ్వర్యంలో నెగెరి సెంబిలాన్‌లో అంగరంగ వైభవంగా అమ్మవారి పూజలు
- పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రవాస తెలంగాణవాసులు



**ప్రజా వాయిస్, ఇంటర్నేషనల్ డెస్క్.** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకైన బోనాల పండుగ ఖండాంతరాలు దాటింది. మలేషియా తెలంగాణ సంఘం (MYTA) ఆధ్వర్యంలో 'బోనాలు 2026' వేడుకలు పోర్ట్ డిక్సన్ సమీపంలోని నెగెరి సెంబిలాన్ శ్రీ మహా కరుమారియమ్మన్ టెంపుల్‌లో ఆగస్టు 9న అంగరంగ వైభవంగా జరిగాయి. విదేశాల్లో ఉన్నప్పటికీ ప్రవాస తెలంగాణ మహిళలు సంప్రదాయ వస్త్ర ధారణతో భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మలేషియాలో స్థిరపడిన తెలంగాణ ఎన్నారైలు, యువత, చిన్నారులు పెద్ద ఎత్తున ఈ ఆధ్యాత్మిక సంబురాలకు తరలివచ్చారు. మంగళహారతులు, డప్పుచప్పుళ్ళు, పూజల మధ్య శ్రీ మహాంకాళి అమ్మవారికి బోనాలు నివేదించి ఆశీస్సులు అందుకున్నారు. విదేశీ గడ్డపై మన ఊరి పండుగ వాతావరణం స్పష్టంగా కళ్లకు కట్టింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా MYTA కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఉచిత బస్సు రవాణాతో పాటు అల్పాహారం, మధ్యాహ్న భోజన వసతులను కల్పించింది. మలేషియాలోని ప్రవాస తెలంగాణ ప్రజలందరినీ ఒకే వేదికపైకి తీసుకురావడంలో ఈ కార్యక్రమం పూర్తి స్థాయిలో విజయం సాధించింది. తెలంగాణ కల్చర్ – మన గర్వం, మన ట్రెడిషన్ – మన బాధ్యత" అనే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని MYTA ప్రతినిధులు తెలిపారు. విదేశాల్లో పెరుగుతున్న భావితరాలకు మన సంస్కృతిని పరిచయం చేయడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ మెగా ఈవెంట్‌ను విజయవంతం చేసిన వాలంటీర్లు, స్పాన్సర్లు, కోర్ కమిటీ సభ్యులకు MYTA అధ్యక్షులు సైదం తిరుపతి, కార్యవర్గ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## 74 లక్షల ఓట్లపై టెన్షన్!

మొదటి పేజీ తరువాయి

**74 లక్షల ఓట్లు గల్లంతైనట్టేనా?**

తెలంగాణలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో ఇప్పటి వరకు 2,64,30,494 ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 78.14 శాతం డిజిటలైజేషన్ నమోదైంది. అయితే ఎన్యూమరేషన్ ప్రక్రియలో ఫారాలు అందని, సంబంధిత చిరునామాల్లో ఓటర్లు అందుబాటులో లేని వారి సంఖ్య భారీగా ఉండటంతో.. సుమారు 73,95,954 ఓట్లు ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారాయి.అయితే ఈ ఓట్లన్నీ శాశ్వతంగా తొలగిపోయినట్లు ఇప్పుడే నిర్ధారించడం సరికాదని ఎన్నికల సంఘం స్పష్టం చేస్తోంది. ఎస్ఐఆర్ ప్రక్రియలో తదుపరి దశలో ముసాయిదా జాబితాను ప్రకటించి.. అర్హులైన ఓటర్లకు తమ అభ్యంతరాలు, క్లెయిమ్‌లు దాఖలు చేసుకునే అవకాశం కల్పించనున్నారు.

**హైదరాబాద్‌లోనే 43 లక్షల ఓట్లపై ఉత్కంఠ!**

ఎస్ఐఆర్ ప్రక్రియలో అత్యంత తక్కువ డిజిటలైజేషన్ నమోదైన ప్రాంతంగా హైదరాబాద్ నిలిచింది. హైదరాబాద్‌లో కేవలం 58.58 శాతం ఫారాల డిజిటలైజేషన్ మాత్రమే పూర్తయింది. దీంతో ఇక్కడ పెద్ద సంఖ్యలో ఓటర్ల పేర్లు ముసాయిదా జాబితాలో కనిపించకపోయే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది.హైదరాబాద్ తర్వాత మేడ్చల్–మల్కాజిగిరి 63.82 శాతం, రంగారెడ్డి 64.91 శాతం డిజిటలైజేషన్‌తో వెనుకబడి ఉన్నాయి.

**డిజిటలైజేషన్‌లో యాదాద్రి టాప్.. హైదరాబాద్ లాస్ట్!**

జిల్లాల వారీగా చూస్తే ఎస్ఐఆర్ డిజిటలైజేషన్‌లో భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. 94.30 శాతంతో యాదాద్రి భువనగిరి మొదటి స్థానంలో ఉంది. ఆ తర్వాత మెదక్ 90.54 శాతం, సూర్యాపేట 90.43 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేశాయి.ఇక హైదరాబాద్ 58.58 శాతంతో చివరి స్థానంలో ఉండగా.. మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలు కూడా తక్కువ శాతంతో కొనసాగుతున్నాయి. దీంతో పట్టణ ప్రాంతాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ ఎదుర్కొన్న సవాళ్లు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.

**40 లక్షల మంది చిరునామాల్లో లేరు!**

ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా దాదాపు 40 లక్షల మంది ఓటర్లు తమ ఓటరు జాబితాలో నమోదైన చిరునామాల్లో అందుబాటులో లేరని అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. వీరిలో కొందరు వలస వెళ్లి ఉండొచ్చని, మరికొందరు చిరునామాలు మార్చుకుని ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు.అందుబాటులో లేని ప్రతి ఓటు వెంటనే తొలగిపోతుందని భావించాల్సిన అవసరం లేదని అధికారులు చెబుతున్నారు. తదుపరి దశలో సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీ చేసి.. అర్హతను నిర్ధారించే ప్రక్రియ చేపట్టనున్నారు.

**ఆగస్టు 17న అసలు లెక్క తేలనుందా?**

ఎస్ఐఆర్ ప్రక్రియ అనంతరం ఆగస్టు 17న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల కానుంది. ఈ జాబితాలో తమ పేరు లేకపోతే అర్హులైన ఓటర్లు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు దాఖలు చేసుకోవచ్చు. అలాగే కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునే వారికి కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించనున్నట్లు ఎన్నికల సంఘం అధికారులు చెబుతున్నారు. అంటే.. ప్రస్తుతం 74 లక్షల ఓట్లు గల్లంతయ్యాయన్న ప్రచారాన్ని తుది నిర్ణయంగా చూడలేమన్నమాట. ముసాయిదా జాబితా విడుదలైన తర్వాతే అసలు పరిస్థితి స్పష్టమవుతుంది.

**రాజకీయ పార్టీల్లో ఎందుకీ టెన్షన్?**

ఎస్ఐఆర్ ప్రక్రియను తెలంగాణలోని ప్రధాన రాజకీయ పార్టీలు మొదటి నుంచే ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ప్రతి నియోజకవర్గంలో ఓటర్ల సవరణ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని తమ నాయకులు, కార్యకర్తలకు సూచిం చాయి. ఇప్పుడు భారీ సంఖ్యలో ఓట్లు ముసాయి దా జాబితాలో లేకపోతే.. వాటిపై క్లెయిమ్‌లు, అభ్యంతరాలు దాఖలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడనుంది.ముఖ్యంగా హైదరాబాద్, మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి వంటి ప్రాంతాల్లో ఓట్ల సంఖ్య భారీగా ఉండటంతో.. ఆగస్టు 17న విడుదలయ్యే ముసాయిదా జాబితాపై రాజకీయ పార్టీల చూపు నిలిచింది. ముసాయిదా జాబితా తర్వాత చోటుచేసుకునే పరిణామాలు తెలంగాణ రాజకీయాల్లో కీలకంగా మారే అవకాశం ఉంది.



## 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

- బుర్కా వెంకటయ్య ఏఐకేఎంఎస్ జిల్లా గౌరవ అధ్యక్షులు

**ప్రజా వాయిస్ కొత్త గూడ** ఆల్ ఇండియా ట్రైబల్ ఫోరం (ఏఐటిఎఫ్) ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవం ను పురస్కరించుకొని కొత్తగూడ మండల కేంద్రంలోని బైపాస్ రోడ్డు వైపు ఉన్న కొమరం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా బుర్కా వెంకటయ్య అఖిలభారత రైతుకూలీ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మాట్లాడుతూ ఆదివాసి ప్రజలకు అత్యంత బలమైన 1/70 చట్టమును రద్దు చేయాలని ఇటీవల కాలంలో ఎర్రం రెడ్డి సత్యనారాయణ తో పాటు 1672 మంది తో సుప్రీంకోర్టులో పిటిషన్ వేసి 1/70 చట్టాన్ని రద్దు కోరుతూన్నా తరుణంలో ఆదివాసి ప్రజలు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం నేడు ఎంతైనా ఉందని వారు అన్నారు. పోరాడి సాధించుకున్న ఆదివాసి హక్కులను, చట్టాలను నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నీరు కారుస్తూ, వాటిని సవరిస్తూ ఆదివాసి ప్రజలను తీవ్ర సంక్షోభంలోకి నెట్టే విధంగా చేస్తుందని అన్నారు, షెడ్యూల్ భూభాగంలో ఉన్న ఆదివాసి ప్రాంతాలలో ఖనిజ సంపదను కొల్లగొట్టుక పోవడానికి సామ్రాజ్యవాద మల్టీనేషన్ కంపెనీలకు విచ్చలవిడిగా అనుమతులు ఇస్తూ ఆదివాసి ప్రజలను అన్యాయం చేస్తుందని పాలకవర్గ పార్టీలపై మండిపడ్డారు. ఏజెన్సీ ప్రాంతంలో అన్నిపోడు భూములకు పూర్తిస్థాయిలో పట్టాలు ఇవ్వాలని వారు ఈ సందర్భంగా ప్రభుత్వాలను డిమాండ్ చేశారు పోరాటాల ద్వారానే ఆదివాసి చట్టాలు, హక్కులు సాధించబడతాయని ఆదివాసులంతా ఐక్యంగా ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు. ఈ యొక్క కార్యక్రమంలో శ్రీశైలం,బూర్కా బుచ్చి రాములు, గట్టి సురేందర్, సతీష్, సువర్ణపాక నరసయ్య, ఈసం సారయ్య, అయిలబోయిన నరేష్, తోలెం నిర్మల, ప్రభాకర్, పూర్ణ చందర్,తదితరులు పాల్గొన్నారు

# మోడీ వినాశనకర విధానాలకు ప్రతిఘటన తప్పదు

- రైతు కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో హన్మకొండ కలెక్టర్ బంగ్లా సెంటర్లో భారీ రాస్తారోకో
- స్తంభించిన ట్రాఫిక్ - నాయకులను అరెస్టు చేసిన పోలీసులు






**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి** స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలు,లేబర్ కోడ్స్ లాంటి వినాశనకర విధానాలతో రైతులను కార్మికులను అధోగతి పాలు చేస్తున్న మోడీ ప్రభుత్వానికి ప్రతిఘటన తప్పదని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కే యం) జిల్లా కన్వీనర్లు.ప్రభాకర్ రెడ్డి,ఎన్ రెడ్డి హంస రెడ్డి, కౌడగాని శివాజీ సిఐటియు జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, ఏ ఐ ఎఫ్ డి ఎస్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం నాగార్జున కేవీ పీస్ జిల్లా కార్యదర్శి మంద సంపత్ హెచ్చరించారు. సోమవారం సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కె ఎం) రైతు,కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జైల్ భరో పిలుపులో భాగంగా హన్మకొండ కలెక్టర్ బంగ్లా సెంటర్లో భారీ రాస్తారోకో చేపట్టారు. మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దాంతో ట్రాఫిక్ భారీగా స్తంభించింది. ఈ క్రమంలో పోలీసులు కలుగజేసుకొని రాస్తారోకో చేస్తున్న రైతు, కార్మిక, ప్రజా సంఘాల నాయకులను బలవంతంగా అరెస్టు చేసి ఆందోళనను విరమింప చేశారు. ఈ సందర్భంగా సి ఐ టీ యూ జిల్లా అధ్యక్షులు ఉప్పలవీరయ్య అధ్యక్ష వర్గంగా జరిగినది ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి, ఎన్ రెడ్డి హంస రెడ్డి కౌడగాని శివాజీ, రాగుల రమేష్ గడ్డం నాగార్జున మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం స్వదేశీ నినాదం పేరు చెప్పి ఆచరణలో అమెరికా లాంటి విదేశాలకు అనుకూలంగా విధానాల రూపకల్పన చేసి స్వదేశీ వ్యవసాయాన్ని రైతులను సంక్షోభంలోకి నెట్టివేస్తున్నారని ఈ క్రమంలో రైతు ఆత్మహత్యలు పెరిగి పోతున్నాయని రైతులు వ్యవసాయాన్ని వదిలి కూలీలుగా కార్మికులుగా మారిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పెరిగిన ఉత్పత్తి ఖర్చులతో పండిన పంటలకు సరైన మార్కెట్ సౌకర్యం లేక గిట్టుబాటు ధర రాక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతాంగాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టివేసే విధంగా 32 దేశాలతో స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలను చేసుకొని అక్కడి ఉత్పత్తులను మనదేశంలోకి అనుమతించడం దారుణం అన్నారు. అమెరికా లాంటి దేశంలో రైతులకు అనేక సబ్సిడీలు రాయితీలు అందించి ప్రోత్సహిస్తుంటే మనదేశంలో మాత్రం అందు విరుద్ధంగా ఉందన్నారు ఇలాంటి పరిస్థితుల్లో స్వేచ్ఛ వాణిజ ఒప్పందాలను తక్షణమే రద్దు చేయాలన్నారు. అలాగే రైతాంగ ఉద్యమానికి ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని మద్దతు ధర రుణ విముక్తి చట్టం చేయాలని కేంద్ర విద్యుత్తు విత్తన చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఉత్పత్తిలో కీలక భూమిక పోషించే కార్మికుల హక్కులను హరించే నాలుగు లేబరు కోడ్స్ ను తక్షణమే రద్దుచేసి పాత కార్మిక చట్టాలను అమలు చేయాలన్నారు. కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా అమలు చేయాలని కోరారు. లేకపోతే రైతులు కార్మికులు ఐక్యంగా ప్రజలందరినీ కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమిస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు, కార్మిక, ప్రజా సంఘాల రాష్ట్ర జిల్లా నాయకులు మాస్ సావిత్రి, ప్రేమ లత రజిత,రాములు, వెంకట్ నాగార్జున మంద సంపత్ రాగుల రమేష్, సాంబయ్య ,తదితరులు పాల్గొన్నారు.

## షాబాద్ లో వైభవంగా బోనాల వేడుకలు

**ప్రజావాయిస్/ షాబాద్:**షాబాద్ గ్రామంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గుండాల అశోక్ మాట్లాడుతూ బోనాల పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు, నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామ మహిళలు తదితరులు పాల్గొని బోనాల వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.





## బోనాల వేడుకలో సర్పంచ్ కుటుంబంపై దాడి..!

- పండుగ పూటే దాడి దుమారం
- మోమిన్ పేట్ మండలం కొత్త కోలుకుంద గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు
- గ్రామ సర్పంచ్ కరణం కీర్తి రామకృష్ణ దంపతులు పోలీసులకు ఫిర్యాదు

**ప్రజావాయిస్ / మోమిన్‌పేట్:**వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండల పరిధిలోని కొత్త కోలుకుంద గ్రామంలో దుర్గమ్మ బోనాల వేడుకలు జరుగుతున్న వేళ తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఆదివారం గ్రామంలో బోనాల కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ సర్పంచ్ కరణం కీర్తి రామకృష్ణ దంపతులు, కుటుంబ సభ్యులపై కొంతమంది వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు వీడియోలో నమోదై ప్రస్తుతం వైరల్‌గా మారాయి.పండుగ వేళ గ్రామస్తులతో కలిసి భక్తిశ్రద్ధలతో కార్యక్రమంలో పాల్గొంటున్న సమయంలో ఒక్కసారిగా చోటుచేసుకున్న దాడితో సర్పంచ్ కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ప్రజాప్రతినిధి కుటుంబంపైనే బహిరంగంగా దాడి జరగడం పట్ల గ్రామంలో తీవ్ర చర్చ జరుగుతోంది.

**పండుగలోనే దాడి.. అసలు కారణమేంటి?**

దుర్గమ్మ బోనాల వంటి పవిత్రమైన వేడుకలో శాంతియుత వాతావరణాన్ని చెడగొడుతూ సర్పంచ్ కుటుంబంపై దాడికి పాల్పడటంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ ప్రజలకు ఆదర్శంగా నిలవాల్సిన పండుగ వేదికపై ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం దురదృష్టకరమని పలువురు పేర్కొంటున్నారు.దాడికి సంబంధించిన వీడియో బయటకు రావడంతో ఘటనపై మరింత చర్చ మొదలైంది. పండుగ సందర్భంగా జరిగిన ఈ ఘటన వెనుక అసలు కారణాలేమిటి? దాడికి పాల్పడిన వారు ఎవరు? అనే అంశాలపై పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.డీఎస్పీ, ఎస్సైని ఆశ్రయించిన సర్పంచ్ దంపతులుఈ ఘటనపై సర్పంచ్ కరణం కీర్తి రామకృష్ణ దంపతులు సోమవారం వికారాబాద్ డీఎస్పీ అంజయ్యను, మోమిన్‌పేట్ ఎస్సై భరత్ భూషణ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. తమ కుటుంబంపై జరిగిన దాడికి సంబంధించిన వీడియో ఆధారాలను పోలీసుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని సర్పంచ్ కుటుంబ సభ్యులు పోలీసులను కోరారు.ప్రజాప్రతినిధులకే రక్షణ లేకపోతే.. సామాన్యుల పరిస్థితి ఏంటి?గ్రామంలో ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్న సర్పంచ్ కుటుంబంపైనే పండుగ వేళ దాడి జరగడం పట్ల పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని, ఘటనపై ఎలాంటి ఒత్తిళ్లకు తావులేకుండా సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.బోనాల పండుగను భక్తి, ఆనందాలతో జరుపుకోవాల్సిన వేళ చోటుచేసుకున్న ఈ దాడి ఘటనకు బాధ్యులెవరో తేల్చి, చట్టం ముందు నిలబెట్టాల్సిందేనని స్థానికులు స్పష్టం చేస్తున్నారు.

## కుత్బుల్లాపూర్‌లో వైభవంగా బోనాల వేడుకలు

- పాల్గొన్న బీజేపీ అధికార ప్రతినిధి నల్ల జై శంకర్ గౌడ్

**ప్రజా వాయిస్/కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నిన్న బోనాల పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. కుత్బుల్లాపూర్ గ్రామం, చింతల్ ప్రాంతాల్లో నిర్వహించిన పాలారం బండి ఊరేగింపు కార్యక్రమాల్లో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా నాయకులు నల్ల జై శంకర్ గౌడ్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా నల్ల జై శంకర్ గౌడ్ మాట్లాడుతూ, బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే గొప్ప పండుగ అని అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ ప్రజలందరూ ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో, సిరిసంపదలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.కుత్బుల్లాపూర్ గ్రామం, చింతల్ ప్రాంతాల్లో బోనాల వేడుకలు భక్తుల సందడి, ఆధ్యాత్మిక వాతావరణం మధ్య వైభవంగా జరిగాయి. భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి నామస్మరణతో ఆయా ప్రాంతాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ఈ కార్యక్రమంలో నల్ల జై శంకర్ గౌడ్‌తో పాటు పులి బలరాం, పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.తెలంగాణ ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, అమ్మవారి ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని నల్ల జై శంకర్ గౌడ్ ఆకాంక్షించారు.



## పోలీస్ ఏఆర్ ఎస్ఐ గుండెపోటుతో మృతి

**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి** వరంగల్ కమిషరేట్ ఆర్మూర్ రిజర్వ్ విభాగంలో ఏఆర్ ఎస్ఐ గా విధులు నిర్వహిస్తున్న ఎస్. శామ్యూల్ (57) సోమవారం ఉదయం సమయంలో హనుమకొండలోని ప్రకాశ్ రెడ్డిపేట జంక్షన్ వద్ద గల తన నివాసంలో ఆకస్మిక గుండె పోటుతో మృతి చెందారు.విధులకు హాజరయ్యేందుకు బయలుదేరుతున్న సమయంలో ఆయనకు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. 1989న పోలీస్ శాఖలో విధుల్లో చేరిన శామ్యూల్ సుమారు 37 సంవత్సరాలుగా పోలీస్ శాఖలో సేవలందించారు.ఆయన మృతి పట్ల పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత తో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు.





## ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి

- ఘనంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం
- బీజేపీ మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాస్

**ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :** హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా భారతీయ జనతా పార్టీ జాతీయ, రాష్ట్ర శాఖల పిలుపు మేరకు పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాస్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కందుల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి భారతీయుడిలో దేశభక్తి, జాతీయతా భావాన్ని మరింత బలోపేతం చేయడమే హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు.ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశ సమైక్యత, సమగ్రత, సార్వభౌమత్వాన్ని చాటాలని పిలుపునిచ్చారు. దేశ స్వాతంత్ర్యం కోసం త్యాగాలు చేసిన స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుంటూ జాతీయ జెండాకు గౌరవం ఇవ్వడం ప్రతి భారతీయుడి బాధ్యత అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు సౌదరి మహేందర్ యాదవ్, మిట్టపల్లి ప్రవీణ్ కుమార్, హర్ ఘర్ తిరంగా జిల్లా కో–కన్వీనర్ ఉషణ అన్వేష్, కోట నాగేశ్వర్, కొల్లూరి సంతోష్ కుమార్, లంక శంకర్, కొమ్మిడి రాజేందర్ రెడ్డి, మెండే శంకరయ్య, బండారి లత, మల్క భాగ్యలక్ష్మి , దాసరి వెంకటేష్, పెరక రమేష్, దొంగల శ్రీనివాస్ రెడ్డి, మనోహర్, వలస సాయి కిరణ్, కొత్తూరి సంపత్, గుర్రం రమేష్, మెంగాని కుమార్, మనుపటి బాలకృష్ణ, ప్రశాంత్, ఈశ్వర్, సుబ్బని సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఓట్ చోర్, నోట్ చోర్ నరేంద్ర మోడీ ని గద్దె దించండి

- నరేంద్ర మోడీ పోవాలి మార్పు రావాలి
- హరిపిరాల నుంచి ప్రారంభమైన సీపీఐ ప్రజా చైతన్య ప్రచార పాదయాత్ర




**ప్రజా వాయిస్ తొర్రూర్** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం హరిపిరాలలో సీపీఐ ఆధ్వర్యంలో ప్రజా చైతన్య ప్రచార యాత్రను ఘనంగా ప్రారంభించారు. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ వల్లపు కొమురెల్లి స్మారక స్థూపం వద్ద నుంచి ఈ ప్రచార పాదయాత్రకు శ్రీకారం చుట్టారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీపీఐ జిల్లా కార్యదర్శి బి. విజయ్ సారధి హాజరయ్యి స్మారక స్థూపం వద్ద నివాళులర్పించిన అనంతరం ప్రజా చైతన్య ప్రచార యాత్రను ప్రారంబించి మాట్లాడుతూ.భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జాతీయ సమితి పిలుపుమేరకు నేడు తొర్రూరు మండలంలో హరిపిరాల, కర్కాల, వెంకటాపురం గ్రామాల్లో విస్తృతంగా సిపిఐ ప్రజాచైతన్య ప్రచార యాత్ర కొనసాగింది నరేంద్ర మోడీ ఓట్ల చోరీ చేసి వివిధ రాష్ట్రాల్లో అధికారంలోకి వస్తున్నాడని రాష్ట్రాల హక్కులను ప్రధాని నరేంద్ర మోడీ హరిస్తున్నాడన్నారు వచ్చే ఎన్నికల్లో మోడీని గద్దె దించడానికి 140 కోట్ల ప్రజలు ఒక్కతాటికే రాబోతున్నారన్నారు ఇక మోడీని గద్దె దింపడం ఖాయమన్నారు అందుకే సిపిఐ దేశ వ్యాప్తంగా ప్రచార యాత్రను నిర్వహిస్తుందని బి విజయ సారధి తెలిపారు

ఈ సందర్భంగా మోడీ పతనం ఖాయమైందని ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో బీహార్ మధ్యప్రదేశ్లలో బిజెపి గోరంగా ఓడిపోయిందని స్వయంగా బిజెపి జాతి అధ్యక్షుడు పోటీ చేసిన స్థానంలో బిజెపి చిత్తుగా ఓడిపోయిందని రాబోతున్నటువంటి ఎన్నికల్లో బిజెపి పతనం ఖాయమన్నారు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించేందుకు దేశవ్యాప్తంగా ఆగస్టు 6 నుంచి 14వ తేదీ వరకు ప్రజా చైతన్య ప్రచార యాత్రలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల సామాన్య ప్రజలు, కార్మికులు, రైతులు, పేదలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ ప్రచార యాత్ర ప్రధాన ఉద్దేశమని అన్నారు. ప్రజా సమస్యలపై ప్రజలను చైతన్యపరిచి, కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.తెలంగాణ సాయుధ పోరాట యోధుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ నిరంతరం పోరాటాలు కొనసాగిస్తుందని తెలిపారు.ఈ ప్రచార యాత్రలో సీపీఐ మండల కార్యదర్శి బందు మహేందర్.నాయకులు సహాయ కార్యదర్శి గణపురం లక్ష్మణ్, పేరబోయిన కిరణ్ కుమార్, పట్టణ కార్యదర్శి ముద్రబోయిన వెంకన్న, శాఖ కార్యదర్శి వల్లపు వెంకన్న, దాసరి కృష్ణమూర్తి, వెంకన్న. సిపిఐ సీనియర్ నాయకులు మంగళపల్లి మల్లయ్య, చంద్రయ్య, వడ్లకొండ మల్లేష్ లు కార్యకర్తలు, ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## బోనం ఎత్తింది బాల్యం.. మురిసింది కనకమామిడి!

- బోనాల వేడుకతో గ్రామమంతా కనువిందు చేసిన పండుగ దృశ్యాలు
- భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి పూజలు చేసిన భక్తులు



**చేవెళ్ల/ ప్రజావాయిస్:** మొయినాబాద్ మండలం కనకమామిడి గ్రామంలో బోనాల పండుగ వేడుకలు భక్తిశ్రద్ధలు, సంప్రదాయాల నడుమ సోమవారం ఘనంగా జరిగాయి. గ్రామమంతా పండుగ శోభను సంతరించుకోగా, భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రదాయ వస్త్రధారణలో చిన్నారులు తలపై బోనాలు ఎత్తుకుని పాల్గొనడం వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.రక్షిత, హర్షిత పసి చేతుల్లో బోనం.. ముఖాల్లో చిరునవ్వులు.. అడుగుల్లో సంప్రదాయ సొగసుతో చిన్నారులు అందరినీ ఆకట్టుకున్నారు. అయితే ఈ దృశ్యం కేవలం పండుగ అందానికే పరిమితం కాకుండా సమాజానికి ఓ విలువైన సందేశాన్ని అందించింది.అమ్మవారిని పూజించడం ఎంత ముఖ్యమో.. తోటి మనిషిని గౌరవించడం అంతకంటే ముఖ్యమనే సందేశం ఈ వేడుక ద్వారా వెల్లివిరిసింది. కులం, మతం, ఆర్థిక స్థితి పేరుతో మనుషుల మధ్య గోడలు నిర్మించకుండా సమానత్వం, సోదరభావం, మానవత్వంతో ముందుకు సాగాల్సిన అవసరాన్ని ఈ పండుగ గుర్తుచేసింది.గుడి ముందు తలవంచడమే భక్తి కాదని.. అన్యాయం ముందు తలవంచకుండా నిలబడటం, బలహీనుడికి అండగా నిలవడం, ఆడబిడ్డను గౌరవించడం, పేదవాడిని ఆదుకోవడం, ప్రతి మనిషిని మనిషిగా చూడటమే నిజమైన భక్తి అనే ఆలోచనను సమాజం ఆచరణలో పెట్టాలని పలువురు ఆకాంక్షించారు.చిన్నారుల తలపై బోనం.. మన సమాజం చేతుల్లో బాధ్యతకు ప్రతీకగా నిలిచింది. సంప్రదాయాలను కాపాడుకుంటూనే.. వివక్షను విడనాడి, మానవత్వాన్ని ముందుకు తీసుకెళ్లినప్పుడే పండుగలకు అసలైన అర్థం చేకూరుతుందని ఈ బోనాల వేడుక చాటి చెప్పింది.





## ఎల్కతుర్తి తహశీల్దార్ కార్యాలయ భవనానికి భూమిపూజ

- కేజీబీవీ పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించిన మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్.
- పాల్గొన్న డిసిసి అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, కలెక్టర్ ఛాహత్ బాజ్‌పాయ్

**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండల కేంద్రంలో నూతనంగా నిర్మించనున్న తహశీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి మంత్రులు భూమిపూజ చేశారు.అనంతరం, ఎల్కతుర్తి మండలంలోనే నూతనంగా నిర్మించిన కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం కేజీబీవీ (KGBV) నూతన పాఠశాల భవనాన్ని మంత్రులు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ అధికారిక కార్యక్రమాల్లో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మరియు పశ్చిమ వరంగల్ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి మంత్రులతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ ఛాహత్ బాజ్‌పాయ్, కిసాన్ కాంగ్రెస్ హనుమకొండ ఛైర్మన్ మరియు డిసిసి ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ ఛైర్మన్ పింగిలి వెంకట్రామ్ నరసింహ రెడ్డి, మండల అధ్యక్షులు మరియు ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు మరియు స్థానిక కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. ప్రజలకు ప్రభుత్వ సేవలను వేగంగా, పారదర్శకంగా చేరువ చేయడమే లక్ష్యంగా నూతన తహశీల్దార్ భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. అలాగే, పేద విద్యార్థినులకు కార్పొరేట్ స్థాయి వసతులతో కూడిన నాణ్యమైన ఉచిత విద్యను అందించడమే ధ్యేయంగా కేజీబీవీ నూతన భవనాన్ని అందుబాటులోకి తెచ్చామని పేర్కొన్నారు.



## భీముడు తండాలో సీసీ రోడ్డు నిర్మాణం

- రూ.5 లక్షలతో అభివృద్ధి పనులు
- స్థానిక నాయకుడు సురేష్ నాయక్‌కు తండావాసుల కృతజ్ఞతలు

**ప్రజా వాయిస్ తొర్రూర్** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం పెద్దదుబ్బతండా గ్రామపంచాయతీ పరిధిలోని భీముడు తండాలో అభివృద్ధి పనులకు స్థానిక నాయకుడు జాటోత్ సురేష్ నాయక్ చొరవతో శ్రీకారం చుట్టారు. హైదరాబాద్ ఫార్మా ఇండస్ట్రీస్ వారి సహకారంతో రూ.5 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు.తండాలో రహదారి సౌకర్యం మెరుగుపడటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల అవసరాలను గుర్తించి సీసీ రోడ్డు నిర్మాణానికి సహకారం అందేలా కృషి చేసిన జాటోత్ సురేష్ నాయక్‌కు తండావాసులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి దాతలు, సంస్థల సహకారం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా దుబ్బతండా గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాదావత్ అశోక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బాదావత్ లింబా, మాజీ వార్డు సభ్యుడు జాటోత్ శ్రీనివాస్, జాటోత్ జవహర్‌లాల్, జాటోత్ అమర్‌సింగ్, లక్పతి, రమేష్, వీరన్న తదితరులు, తండావాసులు పాల్గొన్నారు.

## కనీస వసతులు కరువు.. ఇబ్బందుల్లో అంగన్వాడీ చిన్నారులు

- సమస్యల పరిష్కారానికి జీపీలో నిధులు లేవన్న అధికారులు...!
- అస్తవ్యస్తంగా ఎల్లుపేట అంగన్వాడీ కేంద్రంలోని పరిసరాలు..!



**ప్రజా వాయిస్ టేక్మాల్:** చిన్నారులకు పౌష్టికాహారం, ప్రాథమిక విద్యతో పాటు ఆరోగ్యంపై అవగాహన కల్పించాల్సిన అంగన్వాడీ కేంద్రం కనీస వసతుల కొరతతో ఇబ్బందులకు గురవుతోంది. టేక్మాల్ మండలంలోని ఎల్లుపేట అంగన్వాడీ కేంద్రం దుస్థితి వర్ణనాతీతంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అంగన్వాడీ కేంద్రంలో,పరిసరాలు అస్తవ్యస్తంగా ఉండటంతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. కేంద్రంలో అవసరమైన మౌలిక వసతులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో విద్యార్థులు, సిబ్బంది అవస్థలు ఎదుర్కొంటున్న పరిస్థితి నెలకొంది.కేంద్రం లోపలి భాగంలో పరిశుభ్రత లోపించడంతో చిన్నారుల భద్రతపై కూడా తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు రోజూ వచ్చే కేంద్రంలో కనీస వసతులు కల్పించాల్సిన అవసరం ఉందని వారు కోరుతున్నారు.

**జీపీ నిధులు లేవంటున్న అధికారులు**

అంగన్వాడీ కేంద్రంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని అంగన్వాడీ ఉపాధ్యాయురాలు సరిత గ్రామ సభలో అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, గ్రామపంచాయతీ వద్ద అవసరమైన నిధులు లేవని అధికారులు పేర్కొంటున్నట్లు సమాచారం..! దీంతో సమస్యలు ఎప్పుడు పరిష్కారమవుతాయో తెలియని పరిస్థితి నెలకొందని సరిత వాపోయారు.చిన్నారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు వెంటనే స్పందించి అంగన్వాడీ కేంద్రానికి అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని స్థానికులు, సరిత కోరుతున్నారు. ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



## ప్రజా వాయిస్ ఎఫెక్ట్

- ప్రజా వాయిస్ కథనానికి స్పందించిన మున్సిపల్ అధికారులు , మరియు వార్డు కౌన్సిలర్
- సాయి నగర్ కాలనీ వార్డు నెంబర్ వన్ లో కంకర కుప్పల చిప్పును పరిచిన వైనం
- మున్సిపల్ అధికారులకు, కౌన్సిలర్ కు కాలనీ వార్డు ప్రజలు హర్షం వ్యక్తం
- అదేవిధంగా ప్రజా వాయిస్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన వార్డు ప్రజలు

**ప్రజా వాయిస్ జహీరాబాద్:** మున్సిపల్ పట్టణ పరిధిలోని వార్డు నెంబర్ వన్ సాయి నగర్ కాలనీలో గల్లీ రోడ్లలో కంకర కుప్పలు పోశారు పరచడం మరిచారు అనే వార్త కథనాన్ని ప్రజా వాయిస్ లో ప్రచురించగా ఎట్టకేలకు కదిలిన మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టర్, కౌన్సిలర్ స్పందించి , సాయి నగర్ కాలనీ బురద రోడ్లకు గుంతలు పూడ్చేందుకు పోసిన కంకర చీప్ కుప్పలను పరచక పోవడంతో ప్రజలకు వాహనాదారులకు కష్టాల తిప్పల లేకపోయింది. కావున అధికారులు, వార్డు కౌన్సిలర్ వెంటనే రోడ్డుకు కంకర చిప్పును పరిచి బాటసారులకు, వాహనదారుకు, సమస్య నుండి విముక్తి పలికారు. ప్రజా సమస్యలపై ప్రజా వాయిస్ ఎప్పటికప్పుడు ప్రభుత్వంపై, అధికారులపై, ప్రజాప్రతినిధులపై, ప్రజా వాయిస్ పత్రిక కథనాలతో ప్రజలకు వారధిగా నిలుస్తున్న ప్రజా వాయిస్ కు ప్రత్యేక కృతజ్ఞతలు వార్డు ప్రజలు తెలిపారు..



## సొంత ఖర్చులతో గుంత పూడ్చేందుకు ముందుకొచ్చిన మురళి పంతులు

- పంచాయతీ అనుమతి లేదంటూ పనులను అడ్డుకున్న జంగం శ్రీనివాస్
- నెలలుగా ప్రజలకు ఇబ్బందులు.. ఇకనైనా గుంత పూడ్చాలని డిమాండ్
- రెండు మూడు రోజుల్లో పనులు చేపడతామని హామీ
- స్వచ్ఛందంగా చేసే పనులను మేము అడ్డుకోము: పంచాయతీ ఈవో

**ప్రజా వాయిస్**, **పెద్ద శంకరంపేట**.పెద్ద శంకరంపేట పట్టణంలోని ప్రధాన రహదారిపై నెలలుగా ప్రమాదకరంగా మారిన గుంతను పూడ్చేందుకు ఓ నాయకుడు స్వచ్ఛందంగా ముందుకొస్తే, "పంచాయతీ అనుమతి లేకుండా పనులు ఎలా చేస్తారు?" అంటూ సర్పంచ్ భర్త అడ్డుకోవడం చర్చనీయాంశంగా మారింది. ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయం గుర్తించి తన సొంత ఖర్చులతో గుంతను పూడ్చేందుకు ముందుకొచ్చిన పెద్ద శంకరంపేట మండల కాంగ్రెస్ నాయకుడు మురళి పంతులు పనులు చేపట్టేందుకు సిద్ధమయ్యారు.నెలల తరబడి గుంత అలాగే ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, పలువురు వాహనదారులు గుంతలో పడటంతో గాయాలపాలవుతున్నారని మురళి పంతులు తెలిపారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఎలాంటి స్వార్థ ప్రయోజనం లేకుండా తన సొంత డబ్బులతో గుంతను పూడ్చేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చినట్లు చెప్పారు.అయితే పనులు చేపడుతున్న సమయంలో పట్టణ సర్పంచ్ జంగం రేణుక భర్త, మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్ అక్కడికి వచ్చి పనులను అడ్డుకున్నారని మురళి పంతులు తెలిపారు. గ్రామపంచాయతీ అనుమతి లేకుండా పంచాయతీ పరిధిలో పనులు చేపట్టకూడదని శ్రీనివాస్ చెప్పడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.ప్రజలకు ఇబ్బందిగా ఉన్న గుంతను పూడ్చేందుకు ఎవరైనా ముందుకొస్తే సహకరించాల్సింది పోయి అడ్డుకోవడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సమస్యను పరిష్కరించేందుకు పంచాయతీ ముందుకు వచ్చి వెంటనే పనులు చేపట్టాలని కోరుతున్నారు.ఈ సందర్భంగా జంగం శ్రీనివాస్ స్పందిస్తూ రెండు మూడు రోజుల్లో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో గుంతను పూడ్చి మరమ్మతు పనులు చేపడతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.స్వచ్ఛంద పనులను అడ్డుకోము: ఈవోఈ ఘటనపై గ్రామపంచాయతీ ఈవోను వివరణ కోరగా "ప్రజల కోసం స్వచ్ఛందంగా చేసే పనులను మేము అడ్డుకోము" అని స్పష్టం చేశారు. ప్రజా ప్రయోజనం కోసం స్వచ్ఛందంగా చేపట్టే పనులను పంచాయతీ అడ్డుకోదని తెలిపారు.



## కార్మికులు, వ్యవసాయ కార్మికులు ర్యాలీ నిర్వహించి జాతీయ రహదారిపై రాస్తారోకో జైల్ బరో నిరసన

- తాండూరు తహసీల్దార్ ఆఫీస్ నుండి ఐబీ చౌరస్తా వరకు ర్యాలీ.

**ప్రజా వాయిస్ తాండూర్/** బెల్లంపల్లిమంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గం తాండూర్ మండలం లో దేశ వ్యాప్తంగా జరిగిన జైల్ బరో నిరాశన కార్యక్రమాల్లో భాగంగా ఈరోజు తాండూర్ తాసిల్దార్ ఆఫీస్ నుండి ఐబి చౌరస్తా వరకు కార్మికులు, వ్యవసాయ కార్మికులు ర్యాలీ నిర్వహించి జాతీయ రహదారిపై రాస్తారోకో చేయడం జరిగింది. దాగం రాజారాం సిఐటీయు మంచిర్యాల్ జిల్లా సహాయ కార్యదర్శి, వేల్పుల శంకర్ వ్యవసాయ కార్మిక సంఘం తాండూరు మండల అధ్యక్షులు మాట్లాడుతూజైలు బరో కార్యక్రమం ముఖ్య ఉద్దేశం కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు, వ్యవసాయ కార్మికుల ప్రజా వ్యతిరేక విధానాలు, కార్పొరేట్ అనుకూల విధానాలను ఎండగడుతూ స్వాతంత్రం రాకముందు. స్వాతంత్రం వచ్చిన తర్వాత అనేక పోరాటాలు చేసి ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్నటువంటి 44 చట్టాలను రద్దుచేసి ఈ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్ లను తీసుకువచ్చింది. ఈ నాలుగు లేబర్ కోడ్స్ కార్మికులకు అనేక ఇబ్బందులు కలిగించే విధంగా ఉన్నవి కాబట్టి ఈ నాలుగు లేబర్ కోడ్స్ లను రద్దుచేసి అదే విధంగా ఈ 44 చట్టాలను కొనసాగించాలి గ్రామీణ ప్రాంతాలో కరువు కాలంలో వలసలను నివారించి వేలాదిమంది కుటుంబాలకు ఆర్థిక భరోసా నిచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విబిజీ రాంజీ చట్టం అమల్లోకి వచ్చింది. కేంద్రం ఆర్భాటంగా ప్రకటిస్తున్నప్పటికీ ఈ నూతన చట్టం వల్ల జిల్లాల్లోని ఉపాధి కూలీలకు తీవ్ర అన్యాయం జరగనుంది. యదవిధంగా తిరిగి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలి, ఆదివాసి గిరిజనులకు మరియు ఇతర కులాలు సాగు చేసుకున్నటువంటి సాగు భూములకు పట్టాలు ఇవ్వాలి పేదలను ఆదుకోవాలి, ఈ కార్యక్రమాలలో పాల్గొన్న సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కార్మికులు పాల్గొన్నారు. లీలారాణి, సత్యవతి,సువర్ణ, కే విజయలక్ష్మి, ఎం విజయలక్ష్మి, శారద, లక్ష్మి, మగ్దూం, జైనేని రాజయ్య, బొల్లం రాజేశం, రెడ్డి మల్లక్క, వరలక్ష్మి, జేనేని లక్ష్మి, మరియు నాయకులు కార్మికులు పాల్గొన్నారు.





## ఆదివరాహస్వామి జయంతోత్సవాలకు మంత్రి శ్రీధర్ బాబుకు ఆహ్వానం

**ప్రజా వాయిస్ కమాన్ పూర్** పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండల కేంద్రంలో స్వయంభూగా వెలిసిన శ్రీ ఆదివరాహస్వామి దేవస్థానంలో శ్రావణ మాసం సందర్భంగా నిర్వహించనున్న జయంతోత్సవాలకు హాజరుకావాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును ఆలయ ప్రతినిధులు ఆహ్వానించారు. ఈ నెల 23 నుంచి 26 వరకు నాలుగు రోజుల పాటు ఈ ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని మంత్రి స్వగృహంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ముస్త్యాల దామోదర్, కార్యనిర్వహణాధికారి కొసన కాంతారెడ్డి, ప్రధాన అర్చకులు కలకుంట్ల వరప్రసాదాచార్యులు మరియు ఆలయ డైరెక్టర్లు పాల్గొన్నారు.

# జైల్‌భరోలో జూలకంటి అరెస్ట్

- స్వదేశీ సంపదను కార్పొరేట్లకు అప్పగిస్తున్న మోదీ సర్కార్
- క్విట్ ఇండియా స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలి
- కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి
- లేబర్ కోడ్ లతో కార్మిక హక్కులకు కోత మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి.
- రాస్తారోకోతో రెండు గంటలపాటు స్తంభించిన రాకపోకలు



**ప్రజా వాయిస్,మిర్యాలగూడ**. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకించాలని ఏఐకేఎస్ జాతీయ నాయకులు జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని బస్టాండ్ ఎదుట సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జైల్‌భరో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు గంటలపాటు రాస్తారోకో చేపట్టడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయన్న కారణంతో పోలీసులు ఆందోళన చేస్తున్న జూలకంటి రంగారెడ్డితో పాటు వివిధ సంఘాల నాయకులను బలవంతంగా అరెస్టు చేశారు. అనంతరం జూలకంటి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. నాటి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా సాగిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో నేడు కార్పొరేట్ పెట్టుబడిదారులు, మతోన్మాద శక్తుల విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. నయా ఉదారవాద సంస్కరణల్లో భాగంగా లేబర్ కోడ్‌ల అమలుకు తుది నిబంధనలను నోటిఫై చేసిందని, 'సులభతర వ్యాపారం' పేరుతో కార్మిక చట్టాలను బలహీనపరుస్తోందని ఆరోపించారు. ప్రపంచవ్యాప్తంగా పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచుకునేలా యాజమాన్యాలకు స్వేచ్ఛ కల్పిస్తోందని అన్నారు. కార్మికుల ప్రాథమిక హక్కైన సమ్మెపై ఆంక్షలు విధించడంతో పాటు కార్మిక సంఘాల గుర్తింపు, రిజిస్ట్రేషన్‌ను కష్టతరం చేస్తోందని విమర్శించారు. వామపక్షాల పోరాట ఫలితంగా 2005లో అమల్లోకి వచ్చిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చే విధంగా కేంద్రం వ్యవహరిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మల్లేష్, రవినాయక్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వీరేపల్లి వెంకటేశ్వర్లు, రాగిరెడ్డి మంగారెడ్డి, వినోద్‌నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రమేష్, చేనేత కార్మిక సంఘం నాయకులు భావండ్ల పాండు, ఐద్వా నాయకురాలు గోవర్ధన, అరుణ, సైదమ్మ, అనసూర్య, వామపక్ష రైతు సంఘం నాయకులు బంటు వెంకటేశ్వర్లు, వసుక్కుల మట్టయ్య, టూప్రా నాయకులు జగదీష్‌చంద్ర, సత్యనారాయణరావు, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎర్రనాయక్, ఎస్ఎఫ్ఐ నాయకులు జగన్‌నాయక్, సైదా తదితరులు పాల్గొన్నారు.a





# రాజీవ్ భీమా లిఫ్ట్ ప్రాజెక్టు ప్యాకేజీ-27లో రెండు మోటార్లు స్విచ్ ఆన్ చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావు

- సాగునీరు విడుదల చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావు
- 29,820 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు
- పాన్ గల్ , వీపనగండ్ల మండలాల రైతులకు ప్రయోజనం
- రైతులు సకాలంలో పంటలు సాగు చేసుకునేందుకు అవసరమైన సాగునీటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యం
- కాలువల ద్వారా చివరి ఆయకట్టు వరకు నీరు చేరేలా అధికారులు దృష్టి సారించాలి

**ప్రజా వాయిస్.. వనపర్తి** కొల్లాపూర్ నియోజకవర్గ రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. రాజీవ్ భీమా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు (ఆర్‌బీఎల్ఐ-2) ప్యాకేజీ-27లో రెండు మోటార్లను పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్విచ్ ఆన్ చేసి కాలువలకు సాగునీటిని విడుదల చేశారు. దీంతో ప్యాకేజీ-27 పరిధిలోని 29,820 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుంది. పాన్‌గల్, వీపనగండ్ల మండలాల్లోని వేలాది మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది.రైతులు సకాలంలో పంటలు సాగు చేసుకునేందుకు అవసరమైన సాగునీటిని అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ప్యాకేజీ-27 పరిధిలోని 29,820 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టామని చెప్పారు.రాజీవ్ భీమా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా కరవు ప్రభావిత ప్రాంతాలకు సాగునీరు అందించి వ్యవసాయాన్ని బలోపేతం చేయడంతో పాటు రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. సాగునీటి లభ్యతతో రైతులు సకాలంలో పంటలు సాగు చేసుకునేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు.కాలువల ద్వారా చివరి ఆయకట్టు వరకు నీరు చేరేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు. నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా కాలువల నిర్వహణ, నీటి ప్రవాహాన్ని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.



# సీఎం రేవంత్‌రెడ్డికి గొల్ల-కురుమల గొంగడితో సత్కారం

- వరుణ యాగానికి హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఎమ్మెల్యే జైవీర్ రెడ్డితో కలిసి సన్మానం
- రైతు సుభిక్షం కోసం ప్రత్యేక పూజలు
- సంప్రదాయ గంగడితో ఘనంగా సత్కారం
- కార్యక్రమంలో కాంగ్రెస్ నేతల సందడి

**ప్రజావాయిస్—నాగార్జునసాగర్.** రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి సాగునీటి ప్రాజెక్టులన్నీ జలకళను సంతరించుకోవాలని, తెలంగాణ రైతాంగం పాడిపంటలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ ప్రభుత్వం ఆధ్వర్యంలో నాగార్జునసాగర్ నందికొండ హిల్‌కాలనీలోని విజయవీహార్ లో వరుణ యాగానికి ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డితో కలిసి హాలియా మున్సిపాలిటీ వైస్‌చైర్మన్ గౌని రాజా రమేష్‌యాదవ్ గొల్ల—కురుమల సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే గంగడితో ముఖ్యమంత్రిని ఘనంగా సత్కరించారు. రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రాజెక్టులు నిండి, రైతులకు సాగునీటి ఇబ్బందులు తొలగి పంటలు పుష్కలంగా పండాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అనుముల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రావుల శ్రీనివాస్‌యాదవ్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బోగారంలో ఘనంగా హర్ ఘర్ తిరంగ

- ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలి
- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సింగిరెడ్డి వెంకట్ రెడ్డి

**ప్రజావాయిస్/కీసర:** జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్ ఆదేశాల మేరకు, హర్ ఘర్ తిరంగా జిల్లా కన్వీనర్ బోడ శ్రీనివాసరావు, కీసర డివిజన్ అధ్యక్షులు కోల బాల్ రాజ్ యాదవ్ సూచనలతో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని బోగారం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. హర్ ఘర్ తిరంగా కన్వీనర్ అబ్బబోయిన జంగాలు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ ప్రజలు, నాయకులు జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సింగిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి, జాతీయ జెండా గొప్పతనాన్ని చాటాలని పిలుపునిచ్చారు. దేశభక్తి, జాతీయ సమైక్యతను ప్రతి ఒక్కరిలో పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ అధికార ప్రతినిధి రాగుల అశోక్ ముదిరాజ్, జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి కొలిచేలిమి కృష్ణ, మండల ప్రధాన కార్యదర్శులు నల్ల వెంకట్ రెడ్డి, అబ్బబోయిన నాగరాజు, పొట్ట ఆంజనేయులు, గోసుల శ్రీనివాస్, కోల మల్లేష్, బర్లపాటి ఆంజనేయులు, తాళ్ల మల్లేష్, నల్ల నారాయణ రెడ్డి, వీరాస్వామి, చీరాల మధు, దుర్గం వేణు, మహేందర్, బాలకృష్ణ రెడ్డి, గన్నేర్ల నిఖిల్ తేజ తదితరులు పాల్గొన్నారు.





# అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ పశువుల సంచారం

- పారిశుద్ధ్య సమస్యలు తలెత్తే అవకాశం
- పంచాయతీ చర్యలు తీసుకోవాలని వార్డు సభ్యుడి విజ్ఞప్తి

**ప్రజా వాయిస్ రెబ్బెన/** ఆసిఫాబాద్ రెబ్బెన మండలం గంగాపూర్‌లోనిచిన్నారులకు పౌష్టికాహారం, ప్రాథమిక విద్య అందించే అంగన్‌వాడీ కేంద్రం పరిసరాల్లో పశువుల సంచారం పెరగడంపై స్థానికంగా ఆందోళన వ్యక్తమవుతోంది. రెబ్బెన మండలం గంగాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం వద్దకు ఆవులు, ఇతర పశువులు తరచూ వస్తుండటంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారే అవకాశం ఉందని 8వ వార్డు సభ్యుడు రాజేష్ దుర్గం తెలిపారు.గ్రామంలో పశువుల మంద తిరిగిన అనంతరం కొంతమంది యజమానులు తమ ఆవులను కట్టకుండా వదిలేస్తుండటంతో అవి అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలలు, రోడ్ల వైపు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. చిన్నారులు ఉండే ప్రాంతంలో పశువుల సంచారం వల్ల భద్రత, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు.పశువుల యజమానులు బాధ్యతగా తమ పశువులను ఇళ్ల వద్ద లేదా సురక్షిత ప్రదేశాల్లో కట్టుకోవాలని సూచించారు. ప్రజా ప్రదేశాల్లో పశువులను విచ్చలవిడిగా వదిలే వారిపై గ్రామపంచాయతీ నిబంధనల ప్రకారం జరిమానాలు విధించాలని కోరారు.అంగన్‌వాడీ కేంద్రం పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రపరచడంతో పాటు, పశువుల సంచారాన్ని నియంత్రించేందుకు శాశ్వత చర్యలు చేపట్టాలని పంచాయతీ అధికారులను రాజేష్ దుర్గం కోరారు. ముందుగా పశువుల యజమానులకు అవగాహన కల్పించి, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# రైతుకు అండగా.. వ్యవసాయానికి భరోసాగా రాష్ట్రప్రభుత్వం

- రైతుల కోసం నెలకు సగటున రూ.5,250 కోట్లు ఖర్చు చేస్తున్నాం
- రైతు మేళాలో నేర్చుకున్న కొత్త సాగు పద్ధతులను తోటి రైతులతో పంచుకోవాలి
- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి





**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి** రైతును రాజుగా చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు అంతగా అనుకూలంగా లేకపోయినా రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆత్మ సౌజన్యంతో నిర్వహించిన జిల్లాస్థాయి రైతు మేళాను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్. నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్ పాయి లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో గత రెండేళ్లుగా అనేక ఒడిదుడుకులను అధిగమిస్తూ ముందుకు సాగుతున్నామని అన్నారు. గత ప్రభుత్వం రైతుల కోసం నెలకు సగటున రూ.2,500 కోట్లు ఖర్చు చేస్తే, ప్రస్తుత ప్రభుత్వం రైతుల కోసం నెలకు సగటున రూ.5,250 కోట్లు వివిధ రూపాల్లో ఖర్చు చేస్తోందని తెలిపారు. రైతు సంక్షేమంపై ప్రభుత్వం తీసుకున్న నిబద్ధతకు ఇది నిదర్శనమన్నారు.యాసంగి సీజన్‌లో రైతులు కష్టపడి పండించిన ధాన్యానికి ప్రభుత్వం పూర్తి మద్దతు అందించిందని, ధాన్యం కొనుగోలు సమయంలో కొన్ని ప్రాంతాల్లో ఇబ్బందులు ఎదురైన విషయం వాస్తవమేనని మంత్రి పేర్కొన్నారు. గతంలో తగిన గోదాముల నిర్మాణం, ధాన్యం నిల్వకు అవసరమైన మౌలిక వసతులు కల్పించకపోవడం వల్ల సమస్యలు ఏర్పడ్డాయని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గోదాముల సామర్థ్యాన్ని దాదాపు రెట్టింపు చేసిందని అన్నారు.రైతుల నుంచి ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చిందని, రైతుల పక్షాన నిలబడే ప్రభుత్వం ఇదేనని మంత్రి స్పష్టం చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిరంతరం చర్యలు చేపడుతోందన్నారు.భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. భూ రికార్డులను ప్రక్షాళన చేసి రైతులు, భూ యజమానులకు స్పష్టమైన హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. భూభారతి విధానం ద్వారా భూములకు స్పష్టమైన హక్కులు, టైటిల్, భూ రికార్డులు, మ్యాప్ తదితర వివరాలను అందించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని.రైతులు, భూ యజమానులు తమ భూములకు సంబంధించిన వివరాలను అందించి సమగ్ర భూ సర్వేకు సహకరించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతో భూ రికార్డులను క్రమబద్ధీకరించి భవిష్యత్తులో భూ వివాదాలు, ఆక్రమణలు, హక్కుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని అన్నారు. రాష్ట్రంలోని భూముల యజమానులు సంతృప్తిగా ఉండటమే ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రభుత్వానికి నిజమైన ఆనందమని మంత్రి పేర్కొన్నారు.వర్షాభావ పరిస్థితులు, వాతావరణ మార్పుల నేపథ్యంలో రైతులు పంటల ఎంపికలో జాగ్రత్త వహించాలని మంత్రి సూచించారు. తక్కువ నీటితో అధిక ప్రయోజనం పొందే పంటలను ఎంచుకోవాలని, నేల స్వభావం, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. శాస్త్రవేత్తల సూచనలను రైతుల అనుభవంతో సమన్వయం చేసుకుని ఆధునిక సాగు పద్ధతులను అవలంబించాలని సూచించారు.రైతు మేళాల్లో శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులు, ప్రగతిశీల రైతులు అందించే సూచనలు, నూతన సాగు పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు సానుకూల దృక్పథంతో స్వీకరించి, ఆ జ్ఞానాన్ని తోటి రైతులతో పంచుకోవాలని అన్నారు. " శాస్త్రవేత్తల కంటే రైతులే గొప్ప శాస్త్రవేత్తలు. ఎన్నో ఏళ్లుగా నేలను, నీటిని, పంటలను, ప్రకృతిని పరిశీలించిన అనుభవం రైతులకు ఉంది. ఆ అనుభవానికి శాస్త్రీయ పరిజ్ఞానం తోడైతే వ్యవసాయంలో మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చు" అని మంత్రి అన్నారు.

## జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ

జిల్లా స్థాయి రైతు మేళా ద్వారా రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతికతలు, శాస్త్రీయ విధానాలపై అవగాహన కల్పించడం ఎంతో ఉపయోగకరమని అన్నారు. శాస్త్రవేత్తలు, ప్రగతిశీల రైతుల సూచనలు, అనుభవాలను రైతులు సద్వినియోగం చేసుకుని, వ్యవసాయంలో కొత్త విధానాలను అనుసరించి ఉత్పాదకత, ఆదాయాన్ని పెంచుకోవాలని కలెక్టర్ సూచించారు.రైతు మేళాలో వ్యవసాయ, ఉద్యానవన, ఇతర శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివిధ వ్యవసాయ, వ్యవసాయేతర ఉత్పత్తుల స్టాళ్లను మంత్రి, ప్రజాప్రతినిధులు, రైతులు సందర్శించారు. నూతన సాగు పద్ధతులు, ఆధునిక వ్యవసాయ సాంకేతికత, విత్తనాలు, పంటల సాగు విధానాలు, వివిధ ఉత్పత్తుల గురించి రైతులు నిపుణులను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు, కలెక్టర్ చాహాత్ బాజ్ పాయి, జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర, ఏడీఏ ఆదిరెడ్డి, జిల్లా మత్స్య శాఖ అధికారి శ్రీపతి, జిల్లా హార్టికల్చర్ అధికారి కమలాకర్ రెడ్డి, శ్రీనివాస్ రావు, వివిధ శాఖల అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులు, ప్రగతిశీల రైతులు, జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.



## గుర్రంపోడు ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా మేకల కోటిరెడ్డి ఏకగ్రీవం



**ప్రజా వాయిస్ : గుర్రంపోడ్** మండలం,తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షులు బొట్ల కార్తీక్ ఆదేశానుసారం నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండల ఉప సర్పంచుల ఫోరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ఫోరం అధ్యక్షుడిగా మేకల కోటిరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు నల్లగొండ జిల్లా ఉప సర్పంచుల సంఘం అధ్యక్షులు గాదె రాజశేఖర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుంభం వేణుగోపాల్ రెడ్డి, నూతన కమిటీకి నియామక పత్రాలను అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.మండల ఉప సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షునిగా మంచి కంటి ప్రసాద్, గౌరవ అధ్యక్షుడిగా పోలోజు దక్షిణాచారి, ప్రధాన కార్యదర్శిగా టంగుటూరి సాయికుమార్, సహాయ కార్యదర్శిగా అందుగుల గణేష్, కోశాధికారిగా పాల్వాయి ఏడుకొండలు ఎన్నికయ్యారు.మహిళా విభాగం అధ్యక్షురాలుగా పర్సనబోయిన రాధా వెంకన్న, మహిళా ఉపాధ్యక్షురాలుగా కోట్ల సుప్రియ శ్రీనాథ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మేకల కోటిరెడ్డి మాట్లాడుతూ.. మండలంలోని ఉప సర్పంచుల సమస్యల పరిష్కారానికి, గ్రామాల్లోని అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యం కావడానికి తమ కమిటీ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని పలువురు ఉప సర్పంచులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ఈనెల 16న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ములుగు పర్యటనను విజయవంతం చేయాలి

- పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చేలా ఏర్పాట్లు చేయాలి
- మంత్రి ధనసరి అనసూయ సీతక్క
- ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలి
- జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్



**ప్రజా వాయిస్ ములుగు జిల్లా, ఆగస్టు 10:/** ఈ నెల 16న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ములుగు జిల్లాలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొననున్న నేపథ్యంలో ఆయన పర్యటనను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క సూచించారు. ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ..... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనకు ములుగు జిల్లా నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యేలా నాయకులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మండలాల వారీగా సమన్వయం చేసుకుని పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### మండలాల వారీగా సమన్వయంతో ప్రజలను తరలించాలి.

జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ మాట్లాడుతూ..... ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడం కోసం ప్రతి మండలంలోని పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యమంత్రి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని తెలిపారు. ములుగు జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రారంభం కానున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని నాయకులు పేర్కొన్నారు. పర్యటనకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యేలా గ్రామస్థాయి నుంచి పార్టీ శ్రేణులు కార్యాచరణ చేపట్టాలని నిర్ణయించారు.ఈ సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మల్లాడి రాంరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, పంచాయతీరాజ్ రాష్ట్ర డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవి యాదవ్, డీసీసీ ఉపాధ్యక్షుడు పల్లె జైపాల్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి చింతనిప్పుల బిక్షపతి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు మారం సుమన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మత్స్యశాఖ జిల్లా అధ్యక్షుడు కంబాల రవి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టేవాడ తిరుపతి, వివిధ మండలాల అధ్యక్షులు, జిల్లా సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, చైర్మన్లు, డైరెక్టర్లు, యువజన కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

## సీఎం పర్యటన.. బీఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్ట్

- వరుణ యాగం నేపథ్యంలో పోలీసుల చర్యలు
- మలిదశ ఉద్యమకారులు సహా పలువురు అదుపులోకి
- అరెస్ట్ లను ఖండించిన బీఆర్ ఎస్ నేతలు
- ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నారని ఆరోపణ
- సీఎం పర్యటనను అడ్డుపెట్టుకుని అరెస్ట్ లు దుర్మార్గమంటూ ఆగ్రహం

**ప్రజా వాయిస్,నాగార్జునసాగర్.** సీఎం రేవంత్‌రెడ్డి నాగార్జునసాగర్‌లో వరుణ యాగం కార్యక్రమానికి హాజరయ్యే నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు సోమవారం ఉదయమే ముందస్తుగా అరెస్ట్ చేశారు. సీఎం పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పలువురు బీఆర్ఎస్ నేతలను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే సీఎం పర్యటనను అడ్డుపెట్టుకుని ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేయడం దుర్మార్గమని బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో తమ నిరసనను వ్యక్తం చేసే హక్కును కూడా ప్రభుత్వం అడ్డుకుంటోందని వారు ఆరోపించారు. అరెస్ట్ అయిన వారిలో తెలంగాణ మలిదశ ఉద్యమకారులు వర్ర వెంకటరెడ్డి, వడ్డే సతీష్‌రెడ్డి, సురభి రాంబాబు, పటాన్ అంజత్‌ఖాన్, నల్లగొండ సుధాకర్, ఉంగ్ర గోండ వెంకటయ్య, పగడోజు సైదాచారి, బొడ్డుపల్లి మురళి, పిల్లి వెంకట్‌యాదవ్, పెరుమల్ల రాంబాబు, సీతారాల మహేష్, అల్లుడు సిద్ధు, తక్కెలపల్లి శీను, మారుపాక మధు తదితరులు ఉన్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో ముందస్తు అరెస్ట్‌లు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని బీఆర్ఎస్ శ్రేణులు పేర్కొన్నాయి.




## పెద్దపల్లిలో ఘనంగా మాజీ కేంద్ర మంత్రి పుంజాల శివ శంకర్ జయంతి వేడుకలు

**ప్రజా వాయిస్ పెద్దపల్లి** వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి నిరంతరం శ్రమించిన మహనీయుడు, మాజీ కేంద్ర మంత్రి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ఉపముఖ్యమంత్రి పుంజాల శివ శంకర్ జయంతి వేడుకలను పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని మున్నూరు కాపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు జడల సురేందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రతినిధులు పాల్గొని శివ శంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జడల సురేందర్ మాట్లాడుతూ... పుంజాల శివ శంకర్ వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి, వారి రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు జీవితాంతం కృషి చేసిన మహోన్నత నాయకుడని కొనియాడారు. న్యాయవ్యవస్థలోనూ, కేంద్ర మంత్రిగానూ ఆయన అందించిన సేవలు, బీసీ, బహుజన వర్గాలకు ఆయన చూపిన మార్గం ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మనం ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మీసాల సత్తన్న, నాయకులు ఉప్పు రాజ్ కుమార్, వేల్పుల రమేష్, కొట్టె రవి, తోట జితేందర్, వైద సురేష్, తోట అరవింద్, దశరథం, మెంగని కొమురయ్య, మల్క విక్రాంత్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.





## ప్రజా సమస్యలపై పోరాడుతాం

- గ్రామస్థాయి నుండి పార్టీని పటిష్టం చేస్తాం
- బీజేపీ నూతన జిల్లా అధ్యక్షుడు యు. రమేష్ కుమార్
- రాష్ట్ర అధ్యక్షుడితో మర్యాదపూర్వక కలయిక

**ప్రజావాయిస్/వికారాబాద్ జిల్లా బ్యూరో:** నూతన జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించనున్న రమేశ్ కుమార్‌కు రాష్ట్ర నాయకత్వం అభినందనలు, శుభాకాంక్షలు తెలిపింది.ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లాకు చెందిన పలువురు బీజేపీ ముఖ్య నాయకులు రాష్ట్ర పార్టీ కార్యాలయంలో రమేశ్‌కుమార్‌ను కలిసి అభినందనలు తెలిపారు. జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకలాపాలను విస్తృతం చేయడం పై నాయకులు చర్చించారు. ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ.. పార్టీని ప్రజలకు మరింత చేరువ చేయాల్సిన అవసరాన్ని నాయకులు వివరించారు.వికారాబాద్ జిల్లా పరిధిలోని పరిగి, వికారాబాద్, తాండూరు నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని నాయకులు సూచించారు. గ్రామస్థాయి నుంచి మండల, నియోజకవర్గ స్థాయి వరకు పార్టీ కార్యకలాపాలను విస్తృతం చేయడం ద్వారా బీజేపీకి బలమైన పునాది నిర్మించాలనే లక్ష్యంతో కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు.కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు బీజేపీ సిద్ధాంతాలను క్షేత్రస్థాయిలో ప్రచారం చేస్తామని చెప్పారు. జిల్లాలోని నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయాన్ని పెంచి.. నిరంతర ప్రజా పోరాటాల ద్వారా వికారాబాద్ జిల్లాలో బీజేపీకి మరింత బలమైన పునాది నిర్మించడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఆలాగే తనపై నమ్మకం ఉంచి వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన కేంద్ర, రాష్ట్ర బీజేపీ నాయకత్వానికి రమేశ్‌కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని బలోపేతం చేసేందుకు అందరి సహకారంతో ముందుకు సాగుతానన్నారు.

# బోనాల వైభవం.. ఆధ్యాత్మిక శోభతో మురిసిన భాగ్యనగరం

- అమ్మవారి కరుణ కోసం భక్తజనుల మొక్కులు
- డప్పు దరువులతో మార్మోగిన వీధులుఘటాల ఊరేగింపులు
- పోతరాజుల విన్యాసాలు.. శివసత్తుల పూనకాలు రంగంలో భవిష్యవాణి
- ఏనుగుపై అమ్మవారి ఊరేగింపుతో అంగరంగ వైభవంగా ముగింపు

ప్రజా వాయిస్ డెస్క్,హైదరాబాద్.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విశ్వాసాలకు అద్దం పట్టే ఆషాఢ బోనాల ఉత్సవాలు భాగ్యనగరాన్ని భక్తిపారవశ్యంలో ముంచెత్తాయి. అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకునే భక్తులతో నగరంలోని ప్రధాన ఆలయాలు కిటకిటలాడాయి. సంప్రదాయ దుస్తుల్లో మహిళలు శిరస్సుపై బోనాలను మోసుకెళ్తూ అమ్మవారికి నైవేద్యాలు సమర్పించగా.. డప్పు దరువులు, పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, అమ్మవారి నామస్మరణలతో హైదరాబాద్ వీధులు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.తెలంగాణలో తరతరాలుగా కొనసాగుతున్న బోనాల సంప్రదాయానికి భాగ్యనగరంలో ప్రత్యేక స్థానం ఉంది. ఆషాఢ మాసంలో అమ్మవారికి బోనం సమర్పించడం ద్వారా కుటుంబాలు, సమాజం సుభిక్షంగా ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని భక్తులు కోరుకుంటారు. ఈ ఏడాది కూడా బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో నగరమంతా పండుగ వాతావరణం నెలకొంది.

### గోల్కొండ నుంచి భాగ్యనగరమంతా భక్తి సందడి

హైదరాబాద్‌లో బోనాల ఉత్సవాలకు గోల్కొండ కోటలోని జగదాంబిక అమ్మవారి ఆలయం నుంచి శ్రీకారం చుట్టడం ఆనవాయితీగా వస్తోంది. అక్కడ ప్రారంభమైన ఉత్సవాల సందడి క్రమంగా నగరంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించింది. గోల్కొండలో అమ్మవారికి బోనం సమర్పించిన భక్తులు తమ మొక్కులు తీర్చుకోగా.. అనంతరం సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయం, పాతబస్తీలోని లాల్‌దర్వాజ సింహవాహిని ఆలయం తదితర ప్రాంతాల్లో బోనాల ఉత్సవాలు వైభవంగా కొనసాగాయి.ప్రధాన ఆలయాల వద్ద తెల్లవారుజాము నుంచే భక్తులు బారులు తీరారు. కుటుంబ సమేతంగా ఆలయాలకు చేరుకున్న భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొందరు భక్తులు తమ మొక్కుల్లో భాగంగా బోనాలు సమర్పించగా.. మరికొందరు నైవేద్యాలు, సారె, పట్టువస్త్రాలు సమర్పించి అమ్మవారి ఆశీస్సులు పొందారు.

### మహిళల భక్తిశ్రద్ధలకు ప్రతీకగా బోనం

బోనాల ఉత్సవాల్లో మహిళల పాత్ర ప్రత్యేకంగా కనిపించింది. సంప్రదాయ చీరలు ధరించిన మహిళలు తలపై అలంకరించిన బోనాలను మోసుకుంటూ అమ్మవారి ఆలయాలకు తరలివెళ్లారు. పసుపు, కుంకుమ, వేపమండలు, పూలు, దీపాలతో బోనాలను అందంగా అలంకరించి.. వాటిలో వండిన నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించారు.బోనం కేవలం ఒక నైవేద్యం మాత్రమే కాకుండా.. అమ్మవారిపై ఉన్న భక్తి, కుటుంబ శ్రేయస్సుపై ఉన్న ఆకాంక్ష, తెలంగాణ పల్లె జీవన విధానానికి ప్రతిబింబంగా భావిస్తారు. తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయాన్ని నేటి తరం కూడా కొనసాగించడం విశేషంగా నిలిచింది.బోనం మోసే మహిళల వెంట కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాల్లో పండుగ వాతావరణం నెలకొంది. అమ్మవారి నామస్మరణలతో పాటు డప్పుల మోతలు వినిపించడంతో భక్తుల్లో ఆధ్యాత్మిక ఉత్సాహం మరింత పెరిగింది.

### డప్పు దరువులకు పోతరాజుల వీర విన్యాసాలు

బోనాల ఉత్సవాలకు పోతరాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నుదుటన కుంకుమ, ఒంటిపై పసుపు, చేతిలో కొరడా, సంప్రదాయ వేషధారణతో పోతరాజులు ప్రదర్శించిన నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. డప్పు దరువులు వేగం పుంజుకున్న కొద్దీ పోతరాజుల విన్యాసాలు కూడా ఉత్సాహాన్ని రేకెత్తించాయి.వీధుల్లో ఊరేగింపులు సాగుతున్న సమయంలో పోతరాజులు ముందుండి నృత్యాలు చేస్తూ భక్తుల్లో ఉత్సాహాన్ని నింపారు. వారి వెనుక బోనాలు మోసుకొచ్చే మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో నగరంలోని ప్రధాన రహదారులు బోనాల జాతరను తలపించాయి.

### శివసత్తుల పూనకాలు.. భక్తి పారవశ్యం

బోనాల సందర్భంగా శివసత్తుల పూనకాలు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అమ్మవారిపై తమకున్న అపారమైన భక్తిని వ్యక్తం చేస్తూ శివసత్తులు ఆధ్యాత్మిక పారవశ్యంలో కనిపించారు. అమ్మవారి జయజయధ్వానాలు, డప్పు దరువులు, భక్తుల నినాదాలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి.భక్తులు అమ్మవారిని దర్శించుకుని తమ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు ఆనందంగా ఉండాలని మొక్కుకున్నారు. నగర జీవన పరుగుల మధ్య కూడా బోనాల సందర్భంగా తెలంగాణ సంప్రదాయాల వైభవం మరోసారి వెలుగులోకి వచ్చింది.

### అమ్మవార్లకు ప్రభుత్వ పట్టువస్త్రాలు

బోనాల ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రజా ప్రతినిధులు, మంత్రులు, అధికారులు ప్రధాన ఆలయాలను సందర్శించి అమ్మవార్లకు పట్టువస్త్రాలు, సారె సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు.రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండాలని, వ్యవసాయం అభివృద్ధి చెందాలని, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలని అమ్మవారిని ప్రార్థించారు. ప్రభుత్వ ప్రతినిధుల పర్యటనల సందర్భంగా ఆలయాల వద్ద భక్తుల్లో మరింత ఉత్సాహం కనిపించింది.

### రంగం.. భవిష్యవాణిపై ఆసక్తి

బోనాల ఉత్సవాల్లో అత్యంత ఆసక్తిని రేకెత్తించే కార్యక్రమాల్లో 'రంగం' ఒకటి. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయం, పాతబస్తీలోని ప్రధాన ఆలయాల్లో నిర్వహించిన రంగం కార్యక్రమాన్ని భక్తులు ఎంతో ఆసక్తిగా వీక్షించారు.రంగంలో స్వర్ణలత అమ్మవారి భవిష్యవాణిని వినిపించారు. రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, పంటలు బాగా పండుతాయని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉంటారని భవిష్యవాణి ద్వారా పేర్కొన్నట్లు భక్తులు తెలిపారు.రంగం కార్యక్రమం సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో నిండిపోయింది. అమ్మవారి భవిష్యవాణిని వినేందుకు భక్తులు ఆసక్తిగా ఎదురుచూశారు. భవిష్యవాణి అనంతరం అమ్మవారి ఆశీస్సులు రాష్ట్రానికి, ప్రజలకు లభించాలని భక్తులు ఆకాంక్షించారు.

### ఏనుగుపై అమ్మవారి ఊరేగింపు

బోనాల ఉత్సవాల ముగింపు కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన అమ్మవారి ఘటాల ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలంకరించిన ఏనుగుపై అమ్మవారి ఘటాన్ని ఊరేగిస్తూ నిర్వహించిన కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.ఊరేగింపు మార్గంలో ఇరువైపులా భక్తులు పెద్ద సంఖ్యలో నిలబడి అమ్మవారిని దర్శించుకున్నారు. పూలు చల్లుతూ, కొబ్బరికాయలు కొడుతూ, అమ్మవారి నామస్మరణ చేస్తూ భక్తులు తమ భక్తిని చాటుకున్నారు. డప్పుల దరువులు, సంప్రదాయ కళారూపాలు, భక్తుల నినాదాలతో ఊరేగింపు మార్గం మొత్తం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.

### తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టిన బోనాలు

బోనాలు కేవలం ఒక మతపరమైన ఉత్సవంగా మాత్రమే కాకుండా తెలంగాణ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తున్నాయి. పల్లె సంస్కృతిలో పుట్టి.. కాలక్రమంలో హైదరాబాద్ మహానగర జీవనంలో అంతర్భాగంగా మారిన బోనాలు తెలంగాణ ప్రజల జీవన విధానం, విశ్వాసాలు, సంప్రదాయాలను ప్రతిబింబిస్తున్నాయి.పట్టణీకరణ వేగంగా పెరుగుతున్నప్పటికీ బోనాల సందర్భంగా సంప్రదాయ వేషధారణ, జానపద కళలు, డప్పు దరువులు, పోతరాజుల విన్యాసాలు, అమ్మవారి ఊరేగింపులు ప్రజలను తమ మూలాలతో అనుసంధానిస్తున్నాయి. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అన్ని వర్గాల ప్రజలు ఉత్సవాల్లో పాల్గొనడం బోనాల ప్రత్యేకతను చాటిచెప్పింది.

### భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

బోనాల ఉత్సవాల సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో ప్రభుత్వం, పోలీసు శాఖ, జీహెచ్ఎంసీ అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేశారు. ఆలయాల వద్ద ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయడంతో పాటు తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాలు వంటి ఏర్పాట్లు చేపట్టారు.భక్తుల రద్దీని నియంత్రించేందుకు పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ఊరేగింపు మార్గాల్లో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా సంబంధిత విభాగాలను అప్రమత్తం చేశారు. దీంతో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నప్పటికీ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో కొనసాగాయి.

### రైతు సంక్షేమం కోసం అమ్మవారిని వేడుకున్న భక్తులు

బోనాల పండుగలో వర్షాలు, వ్యవసాయం, రైతుల సంక్షేమం ప్రధాన ఆకాంక్షలుగా కనిపించాయి. సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండాలని, పంటలకు సాగునీరు అందాలని, రైతుల ఇళ్లలో ఆనందం వెల్లివిరియాలని భక్తులు అమ్మవారిని ప్రార్థించారు.రైతు బాగుంటేనే సమాజం సుభిక్షంగా ఉంటుందనే భావన తెలంగాణ ప్రజల మనసుల్లో బలంగా ఉండటంతో.. బోనాల సందర్భంగా అమ్మవారికి సమర్పించిన మొక్కుల్లో కూడా ప్రకృతి అనుకూలత, పంటల సమృద్ధి, ప్రజల ఆరోగ్యం ప్రధానంగా కనిపించింది.

## డాక్టర్ శ్రావణికి టీఎస్‌యూటీఎఫ్ ఘన సన్మానం

- వైద్యురాలిగా ప్రజలకు అంకితభావంతో సేవలు అందించాలి
- బడుగు, బలహీన వర్గాల పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేలా కృషి చేయాలి
- తల్లిదండ్రుల గౌరవాన్ని నిలబెట్టేలా వైద్య సేవలు అందించాలి: టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ



**ప్రజా వాయిస్, వనపర్తి :** టీఎస్‌యూటీఎఫ్ సీనియర్ నాయకులు ఎన్. చంద్రయ్య పద్మ, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం, పీఎస్ రంగాపూర్ ద్వితీయ కుమార్తె డాక్టర్ ఎన్. శ్రావణి నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ సీహెచ్‌సీలో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా ఉద్యోగం పొందిన సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ శ్రావణిని శాలువా, మెమెంటోతో ఘనంగా సన్మానించారు. అనంతరం టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్. రవి ప్రసాద్ గౌడ్, ప్రధాన కార్యదర్శి డి. కృష్ణయ్య మాట్లాడుతూ,,,వైద్యురాలిగా ప్రజలకు అంకితభావంతో సేవలందించాలని, ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాల పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేలా కృషి చేయాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు గర్వించే విధంగా వైద్య వృత్తిలో ఉన్నత స్థానానికి ఎదిగి, సేవా దృక్పథంతో ముందుకు సాగాలని కోరారు.ఈ సందర్భంగా డాక్టర్ శ్రావణి టీఎస్‌యూటీఎఫ్ జిల్లా భవన నిర్మాణానికి రూ.5,000 చెక్కును విరాళంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్. రవి ప్రసాద్ గౌడ్, ప్రధాన కార్యదర్శి డి. కృష్ణయ్య, ఉపాధ్యక్షులు కే. జ్యోతి, బి. వెంకటేష్, కోశాధికారి తిమ్మప్ప, జిల్లా కార్యదర్శులు శ్రీనివాస్ గౌడ్, హమీద్, వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు నరసింహ, చిన్నస్వామి, రమేష్, రిటైర్డ్ టీచర్ వెంకటేశ్వర గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## యూత్ కమిటీలకు క్రికెట్ కిట్ల పంపిణీ

- ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు క్రికెట్ కిట్లు అందజేత.
- యువత క్రీడల్లో రాణించడంతోపాటు శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలి.
- పరిపాటి శ్రీనివాస్ రెడ్డి ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్



**ప్రజా వాయిస్ , రాయపర్తి :** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం జయరాం తండ(S) గ్రామంలోని స్థానిక యూత్ అసోసియేషన్ సభ్యుల వినతి మేరకు సోమవారం ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యూత్ కమిటీ సభ్యులకు రెండు క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి తన చేతుల మీదుగా క్రికెట్ కిట్లను యువతకు అందజేశారు.
ఈ సందర్భంగా యువత క్రీడల్లో రాణించడంతో పాటు శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. క్రీడా సామగ్రిని అందజేసినందుకు యూత్ అసోసియేషన్ సభ్యులు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

**బాధిత కుటుంబాని పరామర్శ**

వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని తన క్లాస్మేట్ అయినా ఎలీసోజ్ రవి తండ్రి బసవయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించగా సోమవారం వారి చిత్రపటానికి నివాళులు అర్పించి వారి కుటుంబానికి మనోధైర్యంగా ఉండాలని వారికి చెప్పడం జరిగింది. వారి కుటుంబాని అన్ని విధాల ఆదుకుంటానని భరోసా కల్పించిన ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి
ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ సెల్ యూనియన్ ఉపాధ్యక్షులు సురేందర్ రాథోడ్ మండల నాయకులు లేతకుల రంగారెడ్డి, తాళ్లపెల్లి సంతోష్ గౌడ్, చందు రామ్, సంకినేని ఎల్లస్వామి, గూగులోత్ గౌస్ నాయక్ సంధి దేవేందర్ రెడ్డి గాదె రవీందర్ రెడ్డి మచ్చ శ్రావణ్ గజవెల్లి ప్రసాద్ ఎం.డి యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు

- ఎండి సర్దార్ ను • పరామర్శించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



**ప్రజా వాయిస్, వనపర్తి :** వనపర్తి జిల్లాపీపనగండ్ల మండల పరిధిలోని కల్వరాల గ్రామానికి చెందిన కల్వరాల గ్రామ బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ఎండి సర్దార్ ఇటీవల నిమ్స్ ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకున్న విషయం తెలుసుకున్న మాజీ వ్యవసాయ శాఖ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సోమవారం పెబ్బేరు పట్టణంలోని సర్దార్ మియా స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. కల్వరాల గ్రామ బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ఎండి సర్దార్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న నిరంజన్ రెడ్డి మెరుగైన వైద్య సేవలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కర్రెస్వామి, విశ్వరూపం, రాజశేఖర్, సాయినాథ్, ఎల్లారెడ్డి, వడ్డెరమేష్, సాయిరెడ్డి, సంబురాము, వేణు, మూర్తి, అఖిల్ తదితరులు, ఎండి సర్దార్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ సంక్షేమ సంఘం ట్రేడ్ యూనియన్ ఉమ్మడి జిల్లా కన్వీనర్‌గా కొమ్ము రాజేష్

**ప్రజా వాయిస్, మంచిర్యాల/ ఉమ్మడి ఆదిలాబాద్ :** జర్నలిస్ట్ సంక్షేమ సంఘం ట్రేడ్ యూనియన్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్‌గా 'వాస్తవ గమ్యం' ఎడిటర్ కొమ్ము రాజేష్ నియమితులయ్యారుఈ సందర్భంగా జర్నలిస్ట్ సంక్షేమ సంఘం నాయకులు, ప్రతినిధులు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు, అభినందనలు తెలియజేశారు. జర్నలిజం రంగంలో తనదైన ముద్ర వేస్తూనే, జర్నలిస్టులా సంక్షేమం కోసం ముందుకు రావడం అభినందనీయమని జర్నలిస్ట్ సంక్షేమ సంఘం నాయకులు కొనియాడారు. కొమ్ము రాజేష్ నాయకత్వంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా (జె,స్,స్) ట్రేడ్ యూనియన్ మరింత బలోపేతం కావాలని, జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో యూనియన్ నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కొమ్ము రాజేష్ మాట్లాడుతూ. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన నాయకత్వానికి, శుభాకాంక్షలు తెలిపిన జర్నలిస్ట్ సంక్షేమ సంఘం ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో యూనియన్ విస్తరణకు, జర్నలిస్టులు మరియు కార్మికుల హక్కుల సాధనకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు.

## జటప్రోలులో యంగ్ ఇండియా స్కూల్ పనులను పరిశీలించిన మంత్రి జూపల్లి కృష్ణారావు

- పనులను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం
- అన్ని వర్గాల పిల్లలకు సమానంగా నాణ్యమైన విద్య అందించాలనేదే ప్రభుత్వా లక్ష్యం
- పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్యను అందుబాటులోకి తీసుకురావాలనేదే ప్రభుత్వ ఉద్దేశం
- మంత్రి జూపల్లి కృష్ణా రావు





**ప్రజా వాయిస్, వనపర్తి :** కొల్లాపూర్ నియోజకవర్గం పెంట్లవెల్లి మండలం జటప్రోలులో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నాణ్యత విషయంలో రాజీపడకుండా నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్గాల పిల్లలకు సమానంగా నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తోందని మంత్రి తెలిపారు.పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్యను అందుబాటులోకి తీసుకురావాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. విద్యతోపాటు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అవసరమైన ఆధునిక వసతులు, ప్రయోగశాలలు, క్రీడా సదుపాయాలతో ఈ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో బాలురు, బాలికలకు ప్రత్యేకంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేయాలన్నది ప్రభుత్వ విజన్ అని తెలిపారు. విద్యారంగాన్ని బలోపేతం చేయడం ద్వారా తెలంగాణ విద్యార్థులను భవిష్యత్ పోటీ ప్రపంచానికి సిద్ధం చేయాలని ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. జటప్రోలు పాఠశాల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

## ఘనంగా మంత్రి జూపల్లి 71వ జన్మదిన వేడుకలు

- ప్రజల కోసం అనునిత్యం ప్రజల్లో ఉన్న నాయకుడు మంత్రి జూపల్లి
- ప్రజలే తనకు బలం అనే నమ్మకంతో పనిచేస్తున్న నాయకుడు మంత్రి జూపల్లి
- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి



**ప్రజా వాయిస్, వనపర్తి :** వనపర్తి జిల్లాపీపనగండ్ల మండల కేంద్రంలో మంత్రి జూపల్లి కృష్ణారావు 71వ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రావుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆయా గ్రామాల సర్పంచులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి మంత్రి జూపల్లి కృష్ణారావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రావుల నారాయణరెడ్డి గ్రామాల సర్పంచులు మాట్లాడుతూ,,, కొల్లాపూర్ నియోజకవర్గ ప్రజల కోసం అనునిత్యం ప్రజల్లో ఉంటూ, "ప్రజలే తనకు బలం" అనే నమ్మకంతో పనిచేస్తున్న నాయకుడు జూపల్లి కృష్ణారావు అని అన్నారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు చేసి, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు.మంత్రి జూపల్లి కృష్ణారావు ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవిస్తూ, ప్రజలకు మరింత సేవ చేసే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచులు ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆయా గ్రామాల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు పలస రామన్ గౌడ్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు వెంకట్ రెడ్డి సర్పంచ్ మీసాల పార్వతి, ఉప సర్పంచుల జిల్లా అధ్యక్షుడు బాలపీరు, ఉప సర్పంచ్ మండల అధ్యక్షుడు నాగముని,ఉప సర్పంచ్ రాంబాబు, కాంగ్రెస్ నాయకులు ఎస్ రవీందర్ రెడ్డి, డీలర్ బస్వారాజు గౌడ్, నక్క విష్ణు, దయ్యపు వెంకటేష్, చిన్నారెడ్డి, వెంకటస్వామి, వార్డ్ మెంబర్ పెబ్బేటిమహేష్, కావలి మహేష్, మోహన్, రాజు, మోహన్ గౌడ్, బాలపీరు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో నారాయణఖేడ్ లో జైల్ భరో

- కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాల్గు లేబర్ కొడ్లను రద్దు చేయాలి
- కార్మికులకు కనీస వేతనం 26000 పెంచాలి

**ప్రజా వాయిస్, నారాయణఖేడ్ :** కేంద్ర ప్రభుత్వం ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జైలు భరో కార్యక్రమం భాగంగా ఎమ్మార్వో గ్రౌండ్ నుండి రాజీవ్ చౌక్ వరకు ర్యాలీగా వెళ్లి రాస్తారోకో నిర్వహించస్తున్న సందర్భంగా నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించడం జరిగింది
ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం నర్సింలు సిఐటియు డివిజన్ కార్యదర్శి ఎన్.రమేష్ లు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వంలు అనుసరిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను నశించాలని ఆశ అంగన్వాడి జిపి మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం 26,000 ఇవ్వాలని ఉద్యోగ భద్రత కల్పించాలని పని ఒత్తిడి తగ్గించాలని పెండింగ్లో ఉన్న జీపీ కార్మికుల జీతాలు చెల్లించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కొడ్లను విద్యుత్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని విద్యుత్ సవరణ చట్టం అమలు చేస్తే యూనిట్కు 12 రూపాయలు చొప్పున ప్రజల మీద భారం పడుతుందని స్మార్ట్ మీటర్లు అంటే టీవీ ఫోన్ రీచార్జ్ మాదిరిగాని కరెంటు ఉపయోగించాల్సి వస్తుందని కావున ఈ చట్టాన్ని ఉపసర్వించుకోవాలని అన్నారు రైతులకు కనీసం మద్దతు ధర కల్పించి రైతులకు సబ్సిడీలు ఇవ్వాలని ఎరువు మందులు ప్రభుత్వమే సబ్సిడీ ద్వారా ప్రతి గ్రామానికి సప్లై చేయాలని అన్నారు అదేవిధంగా ఉపాధి హామీ చట్టాన్ని పేరు మారుస్తూ రెండు పూటలా ఫోటో క్యాప్షన్ తీసుకురావడం 90 శాతం నిధులు ఇవ్వకుండా 60 శాతం నిధులు ఇస్తామని చట్టం చేయడం సరైనది కాదని ఇప్పటికైనా హామీ పథకాన్ని పాత పద్ధతిలోనే కొనసాగించాలని అన్నారు అలాగే నారాయణఖేడ్ ప్రాంతంలో వలసలు నివరించాలంటే పరిశ్రమలు ఏర్పాటు చేయాల్సిందే స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాల్సిందే అని అన్నారు అలాగే నిత్యవసర సరుకుల ధరలు తగ్గించాలని లేనియెడల రాబోయే కార్మికులను ప్రజలను ఐక్యం చేసి పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు ఈ కార్యక్రమానికి మద్దతుగా ఎం సిపిఐయు నాయకులు కుమార్ సిఐటియు రైతు వ్యవసా కార్మిక సంఘం నాయకులు రామ్లాల్ సతీష్ శివరాజ్ రవి,ఏసు,బలప్ప అంజన్న వీణ కుమారి, విద్యావతి చంద్రకళ శకుంతల భారతి ఏలీషా రిక్మిణి సాయమ్మ




## కార్పొరేట్ల కు వత్తాస్తు పలుకుతున్న నరేంద్ర మోడీ విధానాలను నిరసిస్తూ

- వనపర్తి లో జైల్ భరో జయప్రదం
- నాలుగు కార్మిక చట్టాలను రద్దు చేయాలి
- కార్మికులకు కనీస వేతనాలు పెంచాలలి
- ఆత్మహత్యలకు పాల్పడిన రైతు కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం అందించాలి
- వేయిలదిగా కార్మికులు, కర్షకులు వ్యవసాయ కూలీలు పాల్గొన్నారు



**ప్రజా వాయిస్, వనపర్తి :** వనపర్తి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ నుండి ర్యాలీగా బయలుదేరి బస్టాండ్ సెంటర్ లో సిఐటియు, టి యు సి ఐ, ఏ ఐ టి యు సి, రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో ఒక గంట పాటు రాస్తారోకో నిర్వహించడం జరిగింది. ఈ రాస్తారోకోను ఉద్దేశించి సిఐటియుజిల్లా అధ్యక్ష కార్యదర్శులు R N రమేష్, మండ్ల రాజు, టి యు సి ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కుర్మయ్య, అరుణ్ కుమార్, ఏఐ టీయూసీ జిల్లా కార్యదర్శి మోష, ఉపాధ్యక్షులు గోపాలకృష్ణ, తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పరమేష్ ఆచారి జిల్లా ఉపాధ్యక్షులు జి ఎస్ గోపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్ అజయ్, మేకల ఆంజనేయులు తెలంగాణ ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజన్న, వెంకటయ్య. ఏఐకేస్ నాయకులు రాబట్టు మాట్లాడుతూ కార్పొరేట్ల ఆక్రమణకు, న్యాయమైన వేతనాలను తిరస్కరించడానికి వ్యతిరేకంగా కార్మికులు, రైతుల ఐక్యతను చాటడమ. అన్ని పంటలను రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేసేందుకు హామీ కల్పించడంతో పాటూ, సిటు ప్లస్ 50 శాతం ఫార్ములాతో లెక్కించిన మేరకు పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్పి)ను ఇచ్చేందుకు చట్టబద్ధమైన హామీ కల్పించాలన్న డిమాండ్ చేశారు.
దీనికి తోడు, నాలుగు కార్మిక చట్టాలను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనాన్ని పెంచాలని, కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అలాగే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను పూర్తిగా తిరస్కరించాలని, ప్రతిపాదిత విత్తన బిల్లు, 2025ను ఉపసంహరించుకోవాలని, విద్యుత్ ప్రైవేటీకరణ, ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిలిపివేయాలని డిమాండ్ నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలి.కార్మికులందరికీ నెలకు రూ.31 వేలు చొప్పున కనీస వేతనం చెల్లించాలి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్ఆర్ఇజిఎ)ని పునరుద్ధరించి, 200 రోజుల పని దినాలు, రోజుకు రూ.700 దినసరి వేతనం అమల్జేయాలి.సార్వత్రిక సామాజిక భద్రత ఫించను నెలకు రూ.10 వేలు చొప్పున అందజేయాలి.ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ ప్రతిపాదించిన సి2 ప్లస్ 50 శాతం ఫార్ములాతో అన్ని పంటలకు కనీస మద్దతు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. దేశ వ్యవసాయ రంగాన్ని ప్రమాదంలోకి నెట్టేసేలా అమెరికాతో చేసుకున్న అన్ని స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను ఉపసంహరించుకోవాలి.వ్యవసాయ, ఆహార శుద్ధి, ఆహార ఎగుమతులు, అలాగే వ్యూహాత్మక ఎంఎస్ఎంఇ రంగాల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డిఐ)లను అనుమతించరాదు.భారత ఆహార సంస్థ (ఎఫ్‌సిఐ)ని రక్షించి మరింత బలోపేతం చేయాలి.ఎఫ్‌సిఐ గోదాముల స్థానంలో అదానీ – లీప్ ఇండియా గుత్తాధిపత్యానికి తెర దించాల విద్యుత్ ప్రయివేటీకరణ బిల్లు 2025, విత్తన బిల్లు 2025, ఎన్ఎఫ్ఎస్ఎ సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలి. సహకార సంస్థల్లో కార్పొరేట్ సంస్థల ఆక్రమణలను ఆపేయాలి. అన్నదాతల నేతృత్వంలో ప్రజాస్వామిక సహకార సంస్థలను బలోపేతం చేయాలి.సమగ్రమైన రుణ మాఫీ పథకాన్ని ప్రకటించి అప్పుల ఊబిలో నుంచి గ్రామీణ ప్రజలను గట్టెక్కించాలి.ఆత్మహత్యకు పాల్పడిన రైతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం అందజేయాలి.
బలవంతపు భూసేకరణను, కార్పొరేట్ భూసమీకరణను ఎటువంటి పరిస్థితిల్లోనూ చేపట్టకూడదు.భూసేకరణ చట్టం 2013, అటవీ హక్కుల చట్టం 2006, పీసా 1996 చట్టాల ప్రకారం భూ హక్కులను పరిరక్షించాలి. ఎరువులు, ఇంధనం, వంటగ్యాసు, పెట్రోలు, డీజిల్ ధరలను నియంత్రించాలి. సబ్సిడీలను పునరుద్ధరించాలి. రైతులందరికీ ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా పంటల బీమా, పశువుల బీమా కల్పించాలివాటర్‌షెడ్లను అభివృద్ధి చేసి ప్రతి పొలానికి నీటి సౌకర్యం కల్పించాలి.వరదలు, కరువు వంటి ప్రకృతి విపత్తుల సమయంలో పారదర్శకమైన సహాయాన్ని అందజేయాలి. ఇందుకోసం తగిన నిధులు కేటాయించాలి.విద్య కోసం స్థూల జాతీయోత్పత్తి (జిడిపి)లో 6 శాతం నిధులు కేటాయించాలి.కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో 6 శాతం, అలాగే జిడిపిలో 3 శాతం నిధులను పరిశోధన, అభివృద్ధి రంగానికి కేటాయించాలి. ఈ కార్యక్రమం నికి సిపిఎంజిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, ఐద్వా మహిళా సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సాయి లీల, లక్ష్మి , డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మహేష్, ఎంపీ ఆర్డీ నాయకులు మద్దతు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమం లో సిఐటియు జిల్లా కోశాధికారి బొబ్బిలి నిక్సన్ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యవంశం రాము బుచ్చమ్మ జిల్లా ఉపాధ్యక్షులు కే సునీత, శారద కవిత టు యు సి ఐ నాయకులు పెంటయ్య దేవమ్మ గణేష్, C రాజు, ఏ ఐ టి యు సి నాయకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు

## మిస్టరీగా మారిన దుర్గా ఇన్ఫ్రా కంపెనీ కార్మికుడు మృతి...

- గుండెపోటుతో మరణించినట్లు వైద్యుల గుసగుసలు..
- పాముకాటుతో మరణించినట్లు ప్రచారం చేసిన ఆందోళనకారులు
- కార్మికుల భద్రత, సంక్షేమమే మా లక్ష్యం అంటూ తెలిపిన యాజమాన్యం



**ప్రజా వాయిస్, మణుగూరు :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు సింగరేణి ఓపెన్ కాస్ట్ పరిధిలో గల దుర్గ ఇన్ఫ్రా మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో గత కొన్ని సంవత్సరాలుగా క్యాంపు పరిధిలో నివాసం ఉంటూ విధులు నిర్వహించే కార్మికుడు రాణ బహదూర్ పటేల్ ఆకస్మిక మృతి మణుగూరు పట్టణంలో తీవ్ర కలకలం సృష్టించింది. శనివారం ఉదయం ఫస్ట్ షిఫ్ట్ విధులు నిర్వహించిన రానా బహదూర్ పటేల్ కొంతకాలంగా అనారోగ్య కారణంగా ఇబ్బందులు ఆదివారం రాత్రి అనారోగ్య బారిన పడినట్లు గుసగుసలు వినిపించాయి. రాణ బహదూర్ పటేల్ అనే వ్యక్తి ఎక్కువగా పాన్ మసాలాలు తినడం వలన. తరచుగా దగ్గు వచ్చేదని అప్పుడప్పుడు తీవ్రమైన దగ్గుతో తోటి కార్మికులు కనిపించే వారిని అంతర్గతంగా కార్మికులు చర్చించుకోవడం అనుమానస్పదంగా మారింది! మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన రాణా బహదూర్ పటేల్ శనివారం రోజు అర్ధరాత్రి అనారోగ్యానికి గురి కావడం. అదే రూములు నివాసం ఉండే కార్మికులకు ఆయన తన ఆవేదన తెలపడం. నాకు బాగా ఒళ్ళు నొప్పులు వస్తున్నాయి తలనొప్పి వస్తుంది అంటూ తన ఆరోగ్యం బాగాలేదని తెలపడంతో తోటి కార్మికులు సహాయకులు దుర్గా ఇన్ఫ్రా మేనేజ్మెంట్ వారికి తెల్లవారుజామున సమాచారం అందించారు. కార్మికుడి ఆరోగ్యం ఇబ్బందికరంగా ఉందనే విషయం గమనించిన మేనేజ్మెంట్ వారు హుటాహుటిన మణుగూరు పట్టణ పరిధిలో గల ప్రవేటు దావఖానాల్లో వైద్యం అందించే ప్రయత్నం చేసిన ఫలితం దక్కక పోవడం తెల్లవారు జాము కావడం. ప్రైవేటు దావకానల్లో వైద్యులు లేకపోవడం. వలన తోటి సహాయకులకు తీవ్ర ఆందోళన కలిగించింది. దాంతో కార్మికుడికి వైద్యం అందించాలనే ఆలోచన చేసిన తోటి సహాయకులు హుటా హుటిన మణుగూరు ఏరియా దావకానకు తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు చేయించిన తోటి సహాయకులు రాణా బహదూర్ పటేల్ ఆరోగ్యం మరింత ఇబ్బందికరంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం భద్రాచలంలో గల అతిపెద్ద ప్రభుత్వ దావకానకు తరలించే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే లోడర్ ఆపరేటర్ గా విధులు నిర్వహించే కార్మికుడు ఆరోగ్యం క్షీణించింది దాంతో రాణ బహదూర్ పటేల్ భద్రాచలం ఏరియా హాస్పిటల్ లో వైద్యం అందకముందే తుది శ్వాస విడిచాడు. దాంతో ఒక్కసారి ఉలిక్కిపడిన తోటి సహాయకులు రాణా బహదూర్ ఇక మనకు లేరు మరణించాడు అంటూ వారి కంపెనీ అయిన దుర్గా ఇన్ఫ్రా యాజమాన్యానికి చరవాణి ద్వారా సమాచారం అందించారు అందించినట్లు తెలుస్తుంది..

**పాముకాటుతో మరణించినట్లు తప్పుడు ప్రచారాలు...**

మణుగూరు సింగరేణి ఓపెన్ కాస్ట్ పరిధిలో గల దుర్గ ఇన్ఫ్రా మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ క్యాంపు పరిధిలో మట్టి,గుట్టలు పచ్చని చెట్లు ఎక్కువగా ఉన్నాయి అనేది జగమెరిగిన సత్యమే. అయితే ప్రస్తుత వర్షాకాల సమయంలో పాములు తేళ్లు రావడం అనేది తరచుగా జరుగుతూనే వచ్చిన. కట్లపాము క్యాంపు ఆవరణలో తీవ్ర కలకలం సృష్టించింది. అయితే కట్లపామును గుర్తించిన కార్మికులు హుటా హుటిన విష పాము అయిన కట్లపామును చంపినట్లు వీడియో తీయడం జరిగింది. అయితే అదే అదునుగా భావించిన అదే ఒక దొంగతనం చేయగా దొరికిన దొంగ కార్మికుడి కుమారుడు. రాణ బహదూర్ పటేల్ కట్లపాము కాటుతో మరణించినట్లు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేయడం. అవగాహన లేని రాతలు రాయడం మణుగూరు ప్రజలను అయోమయంలో పడేసింది.

**కార్మికుల భద్రత సంక్షేమమే మా లక్ష్యం అంటున్న యాజమాన్యం..**

దుర్గ ఇన్ఫ్రా మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో విధులు నిర్వహించే లోడర్ ఆపరేటర్ రాణా బహదూర్ ఆకస్మిక మరణం పట్ల మేనేజ్మెంట్ వారు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మా కంపెనీలో మా తోటి కార్మికుడి మృతి మృతి చెందడం బాధాకరం అంటూ కార్మికులు కంటతడి పెట్టారు. మా తోటి కార్మికుడు ప్రాణాలు కోల్పోయి దుఃఖంలో మేము ఉంటే.మాపై కొంతమంది ఆందోళన కారులు తప్పుడు ప్రచారం చేయడం సరైన పద్ధతి కాదు అంటూ బాధపడ్డారు.

## సిర్పూర్ పేపర్ మిల్లు వద్ద 80 రోజులకు చేరిన రిలే దీక్షలు



**ప్రజా వాయిస్, కాగజ్ నగర్ :** కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా, సిర్పూర్ మండలం, కాగజ్‌నగర్‌లోని సిర్పూర్ పేపర్ మిల్లు ప్రధాన గేటు ఎదుట రిలే నిరాహార దీక్షలు 80 రోజులకు చేరుకున్నాయి. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన పారిశ్రామిక విధానం, ఐఆర్ కోడ్లకు నిరసనగా జేఏసీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. మిల్లులో గుర్తింపు సంఘం ఎన్నికలు జరగకపోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కారణమని కార్మిక నాయకుడు గోలెం వెంకటేశం ఆరోపించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పార్టీ నూతన ఐఆర్ కోడ్లను చట్టం చేయడంతో కార్మిక రంగం కుదేలైందని, ఈ కోడ్ల ఆధారంగా జేకే యాజమాన్యం ఎన్నికలు నిర్వహించే హక్కు కార్మిక శాఖకు లేదని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, కార్మిక అధికారులు, జేకే యాజమాన్యం తేల్చకుండా కాలయాపన చేస్తున్నాయని ఆరోపించారు.
రాష్ట్రంలో ఆర్టీసీ, కేశవరం సిమెంట్ ఫ్యాక్టరీ, ఓరియంట్ సిమెంట్ ఫ్యాక్టరీతో సహా హైదరాబాద్‌లోని పలు కంపెనీల్లో గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహిస్తున్నా సిర్పూర్ పేపర్ మిల్లులో మాత్రం జరగడం లేదు. యాజమాన్యం స్థానికేతర కార్మికులకు పని కల్పిస్తూ స్థానికులను విస్మరిస్తోందని, స్థానిక కార్మికులకు సరైన వేతనాలు, వేతన ఒప్పందం లేకుండా హక్కులను కాలరాస్తోందని జేఏసీ ఆరోపించింది. గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించడమే ఈ సమస్యకు పరిష్కారమని, ఉద్యమం ఉధృతం కాకముందే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి కోర్టు కేసు ఉపసంహరించేలా యాజమాన్యంపై ఒత్తిడి తేవాలని జేఏసీ డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో గోగర్ల రాములు, ముంజం శ్రీనివాస్, కొత్తకొండ రాజేష్, శీలం రాజమౌళి, గోగర్ల శ్యామ్‌రావు, వల్లాల సుభాష్, షెబ్బీర్ పాషా, మహేష్, జె. వెంకటేష్, ఏకే సింగ్, అంబాల ఓదెలు, గోగర్ల కన్నయ్య, కోరాళ్ళ కృష్ణ, చిట్టవేణి రాజేష్ యాదవ్, కూషన్ రాజన్న, జిల్లా రాఘవులు, అబ్దుల్ నబీ, చారి, నస్పూరీ శ్రీనివాస్, రజినీకాంత్, శీలం నరేందర్, పి. చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధురాలి మెడలో నుంచి పుస్తెలతాడు చోరీ

- ఘటనా స్థలాని పరిశీలించిన ఎస్ ఐ



**ప్రజా వాయిస్, ముత్తారం :** రాత్రి వేళ ఆరుబయట నిద్రిస్తున్న వృద్ధురాలిని లక్ష్యంగా చేసుకుని గుర్తుతెలియని దుండగులు బంగారు గొలుసు ఎత్తుకెళ్లిన సంఘటన పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం లక్కారం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బర్ల లక్ష్మి (80) రాత్రి ఇంటి బయట పడుకోగా, బర్ల మొగిలి దంపతులు ఇంట్లో నిద్రిస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో వచ్చిన గుర్తుతెలియని దుండగులు, ఇంట్లో ఉన్నవారు బయటకు రాకుండా తలుపులకు బయట నుంచి గడియ (బెడెం) పెట్టారు. అనంతరం బయట పడుకున్న లక్ష్మి మెడలో నుంచి సుమారు రెండు తులాల పుస్తెలతాడును అపహరించి అక్కడి నుంచి పరారయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు సమాచారం.

## బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలు మానుకోవాలి

- లేకపోతే మోడీని గద్దె దించుతాం.....
- జైల్ బరో కార్యక్రమంలో వక్తలు.



**ప్రజా వాయిస్ /నల్గొండ క్రైమ్:** కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలు మానుకోకపోతే మోడీ ప్రభుత్వాన్ని ప్రజలే గద్దె దింపుతారని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు చిన్నపాక లక్ష్మీనారాయణ, కెవి పిఎస్ జిల్లా అధ్యక్షులు కొండేటి శీను లు హెచ్చరించారు.సోమవారం సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల, జాతీయ కమిటీ ల పిలుపుమేరకు జైల్ బరో కార్యక్రమంలో భాగంగా నిడమనూర్ మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. రాస్తారోకో చేస్తున్న నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ తరలించారు. సందర్భంగా ప్రజలను ఉద్దేశించి వారు మాట్లాడుతూ అనేక వాగ్దానాలు చేసి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి నాయకత్వంలోని నరేంద్ర మోడీ సర్కార్ కార్మిక రైతాంగ ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తుందని విమర్శించారు. దేశానికి అన్నం పెట్టే అన్నదాతలు కనీస మద్దతు ధరల చట్టం చేయాలని స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని పోరాడుతుంటే అవి పట్టించుకోకుండా వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పజెప్పి దేశ ప్రజల ఆహార భద్రతకు ముప్పు తెచ్చే విత్తన చట్టాన్ని తేవడం,విద్యుత్ సవరణ చట్టం పేరుతో ప్రజలపై భారాల మోపే చర్యలు మానుకోకపోతే భారత రైతాంగం మోడీకి తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. వందేళ్ళ క్రితం కార్మిక వర్గం తమ రక్తాన్ని చిందించి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దుచేసి కార్మిక హక్కులను హరించే 4 లేబర్ కోడ్స్ తెచ్చిందని విమర్శించారు. ఉపాధి హామీ చట్టం ద్వారా ఈ దేశంలో 30 కోట్ల మంది వ్యవసాయ కార్మికులకు అంతో ఇంతో ఆసరాగా ఉన్న చట్టాన్ని రద్దుచేసి వ్యవసాయ కార్మికుల ఆకలి తో చంపే విబిజి రాంజీ చట్టం తేవడం ఏం న్యాయమని ప్రశ్నించారు. 79 ఏండ్ల స్వతంత్ర భారతదేశంలో ప్రజల రెక్కల కష్టంతో నిర్మించుకున్న ప్రభుత్వ రంగ సంస్థలను స్వదేశీ విదేశీ కార్పొరేట్ వ్యక్తులకు కారు చౌకగా అమ్ముతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో భారత రాజ్యాంగం ప్రజాస్వామ్యం లౌకిక విలువలకు గోరి కట్టే విధంగా బిజెపి పాలన ఉందని విమర్శించారు. పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలు నిరుద్యోగం కార్మికుల నిజ వేతనాలు పడిపోతూ ప్రజల అల్లాడుతుంటే మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చులు పెడుతూ ప్రజల భావోద్వేగాలతో రాజకీయాలు చేస్తుందని వీటిపట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల కార్మిక రైతాంగ ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోకపోతే రాబోయే కాలంలో మరిన్ని పోరాటాలకు కార్మిక వర్గం సిద్ధమవుతుందని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కందుకూరి కోటేష్, సిఐటియు మండల కన్వీనర్ కోమండ్ల గురువయ్య, రైతు సంఘం మండల అధ్యక్షులు నడ్డి నాగరాజు, ప్రజాసంఘాల నాయకులు ఆకారపు నరేష్, మల్లీ కంటి చంద్రశేఖర్, వింజమూరి శివ, కుంచెం శేఖర్,వెంపటి మహేష్,, ముత్యాల కేశవులు, గుత్తా శ్రీనివాస్ రెడ్డి,బొడ్డు లింగయ్య, శ్యామల రాజేష్, చిత్రం శ్రీను, కందుల పరమేష్, వెంకటమ్మ, సైదమ్మ, మేరమ్మ, సాంబయ్య, సైదులు, తదితరులు పాల్గొన్నారు......

# మోతే పట్టినగర్‌లో అక్రమ నిర్మాణాలు!!

- ఆర్అండ్‌బీ స్థలంలో రాత్రివేళల్లో యథేచ్ఛగా నిర్మాణాలు...
- పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోని పంచాయతీ అధికారులు...
- అక్రమ నిర్మాణాలపై పంచాయతీ చర్యలు శూన్యం...
- మండల ఉన్నతాధికారులు
- చర్యలు చేపట్టాలంటూ ఉన్న స్థానికులు...





**ప్రజా వాయిస్, బూర్గంపాడు :** బూర్గంపాడు మండలం, మోతే పట్టినగర్‌లో ప్రభుత్వ స్థలాల ఆక్రమణకు అక్రమార్కులు తెరలేపారా? ఆర్అండ్‌బీకి చెందిన స్థలంలో రాత్రి వేళల్లో యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చీకటి పడితే చాలు.. నిర్మాణ పనులు జోరందుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. పగటిపూట పనులు నిలిపివేసి, రాత్రి సమయంలో గోడలు నిర్మిస్తూ ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించే ప్రయత్నాలు జరుగుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు.ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్న విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిస్థితిలో ఎలాంటి మార్పు కనిపించకపోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. పలుమార్లు పంచాయతీ అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ నిర్మాణాలు మాత్రం ఆగకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**చీకటి పడితే చాలు.. గోడల నిర్మాణం జోరు...**

ఆర్అండ్‌బీ స్థలంలో రాత్రివేళల్లో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. నిర్మాణ సామగ్రిని రాత్రివేళల్లో తరలించి, గోడలు నిర్మిస్తున్నారని పేర్కొంటున్నారు. రాత్రివేళల్లో పనులు సాగుతున్న విషయం తెలిసినా వాటిని అడ్డుకునేందుకు అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు.ఒక వైపు ప్రభుత్వ స్థలాల పరిరక్షణపై అధికారులు మాట్లాడుతుంటే, మరోవైపు తమ కళ్ల ముందే ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు జరుగుతున్నా స్పందించకపోవడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

**ఫిర్యాదులు ఎన్నో.. ఫలితం శూన్యం...**

అక్రమ నిర్మాణాలపై పంచాయతీకి పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం కనిపించడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా చర్యలు మాత్రం నామమాత్రంగా ఉండటంతో నిర్మాణదారులకు మరింత ధైర్యం వస్తోందని అంటున్నారు. అధికారులు వెంటనే స్పందించకపోతే ఈ నిర్మాణాలు పూర్తయి, ప్రభుత్వ స్థలం పూర్తిగా ఆక్రమణకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ముడుపులు ముట్టాయా...? అందుకే మౌనమా?...**

అక్రమ నిర్మాణాలు జరుగుతున్న విషయం అధికారుల దృష్టికి వెళ్లినా ఎందుకు అడ్డుకోవడం లేదనే ప్రశ్నలు ఇప్పుడు స్థానికుల్లో బలంగా వినిపిస్తున్నాయి. అక్రమార్కుల నుంచి ముడుపులు ఏమైనా ముట్టుతున్నాయా? అందుకే అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారా?అంటూ స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు మౌనం వహించడం వెనుక అసలు కారణమేంటో బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**అధికారుల మౌనం వెనుక మతలబేంటి?...**

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు ఉన్నప్పటికీ పనులు నిరాటంకంగా కొనసాగుతుండటంపై పంచాయతీ అధికారుల తీరుపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల అండదండలు లేకుండా ప్రభుత్వ స్థలంలో ఇంతకాలం నిర్మాణాలు కొనసాగడం ఎలా సాధ్యమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**ప్రభుత్వ స్థలానికి రక్షణేది?...**

ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి వాస్తవాలను నిగ్గుతేల్చాలని స్థానికులు కోరుతున్నారు. ఆర్అండ్‌బీ స్థలాన్ని సర్వే చేసి, ప్రభుత్వ భూమి హద్దులను నిర్ధారించి, అక్రమ నిర్మాణాలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలు పూర్తయిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే.. నిర్మాణ దశలోనే అడ్డుకోవాలని స్థానికులు సూచిస్తున్నారు. లేకపోతే భవిష్యత్తులో ప్రభుత్వ స్థలాల ఆక్రమణకు ఇది నిదర్శనంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

**చర్యలు తీసుకోకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు...**

ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మోతే పట్టినగర్‌లోని ఆర్అండ్‌బీ స్థలంలో జరుగుతున్న నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అక్రమమని తేలితే వెంటనే నిలిపివేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. పలుమార్లు ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోకుండా ఇదే పరిస్థితి కొనసాగితే ఉన్నతాధికారుల దృష్టికి పూర్తి ఆధారాలతో తీసుకెళ్తామని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వ స్థలాన్ని కాపాడాల్సిన బాధ్యత అధికారులదే కాదా? అక్రమ నిర్మాణాలు కళ్ల ముందే జరుగుతున్నా ఇంకా ఎందుకు మౌనం? ఇప్పటికైనా అధికారులు మేల్కొని చర్యలు తీసుకుంటారా..? లేక నిర్మాణాలు పూర్తయ్యే వరకు వేచి చూస్తారా?

## విద్యార్థిపై దాడి దుర్మార్గం

- దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- యూఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షుడు ఎం. చంద్రకాంత్

**ప్రజా వాయిస్, మేడ్చల్ జిల్లా:** మేడ్చల్ మల్కాజ్‌గిరి దమ్మాయిగూడలోని చైతన్య హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థి అభిషేక్‌పై ర్యాగింగ్ పేరుతో దాడి చేసిన ఘటనను యూఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది.విద్యార్థిని కర్రలతో కొట్టడంతో పాటు బూట్లతో తన్నారని యూఎస్ఎఫ్ఐ ఆరోపించింది. ఈ దాడిలో విద్యార్థి తీవ్రంగా గాయపడటంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపింది. పిల్లలకు నాణ్యమైన విద్య అందుతుందనే ఉద్దేశంతో తల్లిదండ్రులు కార్పొరేట్ స్కూళ్లలో చేర్పిస్తే, అక్కడ విద్యార్థులపై ఇలాంటి దాడులు జరగడం ఆందోళనకరమని పేర్కొంది. ఈ ఘటనపై యూఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షుడు ఎం. చంద్రకాంత్ మాట్లాడుతూ, విద్యార్థిపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు. గాయపడిన విద్యార్థికి మెరుగైన వైద్యం అందించడంతో పాటు తగిన నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు.కార్పొరేట్ స్కూళ్లలో ర్యాగింగ్, విద్యార్థులపై దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని యూఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. విద్యార్థుల భద్రతకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని కోరింది. ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని యూఎస్ఎఫ్ఐ హెచ్చరించింది.





## లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలి : సీఐటీయూ డిమాండ్

**ప్రజా వాయిస్, ఆసిఫాబాద్ :** కాగజ్‌నగర్‌లో క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్మికులు సోమవారం భారీ ప్రదర్శన నిర్వహించారు. బాలభారతి హైస్కూల్ నుంచి బయలుదేరిన ప్రదర్శన రాజీవ్‌గాంధీ చౌరస్తాకు చేరుకోగా, సీఐటీయూ ఆధ్వర్యంలో జైల్ భరో–రాస్తారోకో కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చిందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ విమర్శించారు. ఈ కోడ్లు అమలైతే 12 గంటల పని విధానం, సామాజిక భద్రత లేమి తలెత్తుతాయని, సమ్మె హక్కులకు పరిమితులు, కార్మిక సంఘాల ఏర్పాటుపై కఠిన నిబంధనలు, ముందస్తు నోటీసు లేకుండా తొలగింపులకు అవకాశం కల్పిస్తున్నారని ఆరోపించారు. అమెరికా ఆంక్షలు, దిగుమతి విధానాల వల్ల రైతాంగం నష్టపోతుందని, నూతన విద్యుత్ విధానం ద్వారా స్మార్ట్ మీటర్లతో చార్జీలు పెరిగి జీరో బిల్లు పథకం రద్దయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని వీబీ–జీ రాంజీ చట్టంగా మార్చి, నిధుల్లో 40 శాతం రాష్ట్ర ప్రభుత్వమే భరించాలనే షరతు వల్ల గ్రామీణ ఉపాధి అవకాశాలు తగ్గే ప్రమాదం ఉందని తెలిపారు. కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకుని నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముంజం శ్రీనివాస్, ముంజం ఆనంద్ కుమార్, వెలిశాలి కృష్ణమాచారి, ఈ. శంకర్, ఎన్. పద్మలక్ష్మి, కూసన రాజన్న, మహేష్, ఏ. ఓదేలు, కోట శ్రీనివాస్, మాచర్ల వినోద, షాహినా, భాగ్య, మల్లేష్, బొర్కుట్ రాజేందర్, పండుగ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.




## లేబర్ కోడ్స్, విబిజి రాంజీ చట్టాన్ని బిజెపి రద్దు చేయాలి

- కేంద్ర ప్రభుత్వం కార్మిక, ప్రజాగ్రహానికి లోనుకాక తప్పదు..
- సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన ర్యాలీ ధర్నా..
- క్విట్ ఇండియా ఉద్యమం స్ఫూర్తితో జహీరాబాద్ లో జైలు భరో జయప్రదం..



**ప్రజా వాయిస్ జహీరాబాద్:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ కేంద్ర బీజేపీ ప్రభుత్వం అధికారంలో వచ్చిన నుండి కార్మిక ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తూ, కోట్లాదిమంది కార్మికుల ప్రయోజనాలను కేవలం కొంతమంది పెట్టుబడిదారులు పారిశ్రామికవేత్తలకు ఊడిగం చేస్తుందని అందులో భాగంగానే కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ తేవడం, ఉపాధి హామీ చట్టాన్ని మార్చి వి బి జి రాంజీ ని తేవడం, రైతు వ్యతిరేక విధానాలను అవలంబించడం వీటన్నింటిని వెంటనే ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మిక ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదని బిజెపి ప్రభుత్వానికి కార్మికులు, ప్రజలు చమర గీతం పాడుతారని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహిపాల్ అన్నారు. సోమవారం దేశవ్యాప్తంగా సిఐటియు ఏఐకేఎస్ వ్యకసల ఆధ్వర్యంలో భాగంగా జహీరాబాద్ లోని శ్రామిక భవన్ నుండి జాతీయ రహదారిపై భారీ నిరసన ర్యాలీ ప్రదర్శన నిర్వహించి బస్టాండ్ వద్ద రాస్తారోకో నిర్వహించడం జరిగింది. కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్స్ను తీసుకురావడం అంటే, వివిజి రాంజీ చట్టాన్ని చేయడం అంటే ఈ దేశంలో సంపదను ఉత్పత్తి చేస్తున్న కోటానుకోట్ల కార్మికులు రైతాంగం వ్యవసాయ కూలీల హక్కులను కాలరాస్తూ కేవలం కొంతమంది పెట్టుబడిదారులు పారిశ్రామికవేత్తలకు ఊడిగం చేయడమే అవుతుందని ఇలా చేయడం కేంద్ర ప్రభుత్వానికి తగదని సిగ్గుచేటని అన్నారు. తక్షణమే కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ ను, కూలీల పుట్టగొట్టే విబిజీ రాంజీ చట్టాన్ని రద్దు చేయాలని లేని పక్షంలో తిరుగుబాటు తప్పదని క్విట్ ఇండియా స్ఫూర్తితో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జహీరాబాద్ మండల అధ్యక్ష కార్యదర్శులు తుల్జారాం, సుకుమార్, సిఐటియు మండల కన్వీనర్ నరేష్, మరియు వివిధ యూనియన్లు రంగాల నాయకులు సందీప్ రెడ్డి, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు..

## విద్యుత్ షాక్‌తో కాంట్రాక్టు కార్మికుడు మృతి

**ప్రజా వాయిస్ కాగజ్ నగర్ :** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్ మండలం గొంట్లపేట–మొట్లగూడ బస్టాండ్ వద్ద విద్యుత్ పనులు చేస్తుండగా కాంట్రాక్టు కార్మికుడు చందుకు షాక్ తగిలి కింద పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతదేహాన్ని కాగజ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న కేంద్రం



**ప్రజా వాయిస్, వేములపల్లి :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్పోరేట్ శక్తులకు అండగా ఉంటుందని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు పాతూరి శశిధర్ రెడ్డి అన్నారు సోమవారం కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ప్రజా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు, కేంద్రంలో బిజెపి అధికారం చేపట్టిన 12 సంవత్సరాల కాలంలో ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న లేబర్ చట్టాలను రద్దు చేయడంతో పాటు విద్యుత్ సంస్కరణల చట్టం విత్తన చట్టాలతో వ్యవసాయ రంగాన్ని కార్పొరేటర్లకు అప్పజెప్పే ప్రయత్నం చేస్తుందన్నారు, ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి వి బి జి రాంజీ పేరుతో కొత్త పథకాన్ని తెచ్చి 30 కోట్ల వ్యవసాయ కార్మికులకు జీవనాధారం లేకుండా చేస్తుందన్నారు, ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పాల్వాయి రామ్ రెడ్డి, సిఐటియు జిల్లా నాయకులు శ్రీనివాస్, శీలం పద్మ కోడి రెక్క వెంకన్న విగ్నేశ్వరి నాగమ్మ ఝాన్సీ కౌసల్య లక్ష్మి వెంకటేశం సత్యం తదితరులు పాల్గొన్నారు

## లేబర్ కోడ్స్‌ను రద్దు చేసి కార్మిక హక్కులను కాపాడాలి..

- ఉపాధి హామీ పథకంలో 200 రోజుల పని కల్పించాలి...
- పంటలకు తగిన గిట్టుబాటు ధర కల్పించాలి....
- కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు ఐక్యంగా పోరాడాలి...
- రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ర్యకల శ్రీశైలం...



**ప్రజా వాయిస్, బొమ్మలరామారం:** యాదాద్రి భువనగిరి జిల్లా దేశవ్యాప్తంగా నిర్వహించిన జైల్‌భరో కార్యక్రమంలో భాగంగా సోమవారం బొమ్మలరామారం మండల కేంద్రంలో సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గంటపాటు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ర్యకల శ్రీశైలం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్‌ను అమలు చేస్తూ కార్పొరేట్ సంస్థలకు అనుకూల విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. లేబర్ కోడ్స్ ద్వారా కార్మికులు పోరాడి సాధించుకున్న 8 గంటల పని హక్కు, సమ్మె హక్కు, కార్మిక సంఘాల హక్కులు, ఉద్యోగ భద్రతకు ముప్పు ఏర్పడుతోందన్నారు. ఉపాధి హామీ పథకానికి తగిన నిధులు కేటాయించి గ్రామీణ పేదలకు సంవత్సరానికి కనీసం 200 రోజుల పని కల్పించాలని డిమాండ్ చేశారు. రైతులకు గిట్టుబాటు ధర, వ్యవసాయ కూలీలకు కనీస వేతనాలు, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్పొరేట్ అనుకూల విధానాలను విడనాడి రైతు, కార్మిక, వ్యవసాయ కూలీల హక్కులను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు, ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, అంగన్వాడీ సంఘం అధ్యక్షురాలు , గ్రామపంచాయతీ కార్మికులు, మధ్యాహ్న భోజన కార్మికులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.